# కల్వరి క్రాంతి

**Editor : Dr. P. Satish Kumar**
Calvary, Post Box No. 30, Kukatpally, Hyd - 72. Ph: 939 222 9996

## లోపలి పేజీల్లో.....


- సహాయం చేయకపోతే పాపమా..?
- చిన్నపిల్లలు మరణిస్తే ఎక్కడికి వెళ్తారు?
- దయ్యం పట్టినట్లయితే..?
- **ఎవరుబడితే వారివెంట...**
- ఆయన మా నాన్న కాదు
- **మంచం క్రింద కూడా ఊడుస్తాను**
- సాతానంటే నాకు భయమా ?
- తాగేవారికి ఈ విష(య)ం తెలుసా?
- **దేవుడు కనబడటం లేదు**
- లోతు లేని లోతు !
- ప్రార్ధనా శక్తి
- **యేసయ్య బిజీగా వుండి...**
- పౌలుగారి సాక్ష్యం...
- విజయానికి పది సూత్రాలు
- ఏ భేదము లేదు - అందరూ "బాబా" లే !!!
- నాకే ఎందుకు ఈ కష్టం
- **ఈ చరిత్ర సత్యాలు**
- అవమాన పరచబడియు...
- **ప్రసంగ సహకారి**


Volume-I Issue- VIII
Sep-Oct 2007 R.N.I. No. APTEL 08828 01/1/2004 TC

ముందుగా......

ప్రభువునందు ప్రియమైన కల్వరి పాఠకులకు ప్రభువు పేరట శుభములు. ఈ కల్వరి పరిచర్యను ప్రేమించి, ప్రార్థిస్తూ, మమ్ము్మను ప్రోత్సహిస్తూ మీరు వ్రాస్తున్న ఉత్తరములను బట్టి, పంపుచున్న కానుకలను బట్టి మీకు నిండువందనములు. క్రైస్తవ సంఘాన్ని ఉజ్జీవింపజేసి, కాపరులను బలపరచి, తద్వారా నశించుచున్న ఆత్మలను సంపాదించాలనే భారముతో ఈ పరిచర్యను కొనసాగించుచున్నాము. దేవుని మహాకృపను బట్టి మరియు విశ్వాసము ద్వారా, అనేక మంది పంపుచున్న త్యాగపూరితమైన కానుకల ద్వారా ఈ పరిచర్య ముందుకు సాగుచున్నది.

ఈ పరిచర్యలో మీరు భాగస్తులుగా చేరి, దేవుడు మిమ్ము్మను ప్రేరేపించుకొలది ఎంతోకొంత సహాయాన్ని క్రమముగా పంపించి ఈ పరిచర్యను ప్రోత్సహించ వలసినదిగా ప్రభువు పేరట మనవి చేస్తున్నాము. మీ ప్రార్థన, మీ సహకారం మాకు ఎంతో అవసరమని మరువ వద్దు.

**- కల్వరి.**

**ఈ పత్రిక ఉచితం కాదు, సం॥రపు చందా రూ॥ 100/- మాత్రమే !**

మా చిరునామా : **ఎడిటర్ : డా॥ పి. సతీష్ కుమార్**
కల్వరి, పోస్ట్ బాక్స్ నెం. 30, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 72. (ఆం.ప్ర.)
ఫోన్ : 040 - 32968676, 32978777

# సహాయం చేయకపోతే పాపమా..?




ఒక ప్రాంతంలో ఒక కుర్రాడు పొరపాటున కాలుజారి కాలువలో పడ్డాడు. రక్షించండీ! రక్షించండీ! అని కేకలు వేస్తూ వున్నాడు. ఒడ్డున ఈత వచ్చిన ఒక వ్యక్తి ఆ కుర్రాడు మునిగిపోతున్నా తనకేమి పట్టనట్టుగా, లెక్కలేనట్టు చూస్తూ వుండిపోయాడు కాని కాపాడే ప్రయత్నం చేయలేదు. ఈలోగా ఆ కుర్రాడి తల్లి అక్కడకు చేరి ఒక్కగాని ఒక్క కన్న కొడుకు నీళ్ళలో మునిగిపోతూ వుండగా ఈత వచ్చిన అతనిని కాళ్ళావేళ్ళా పడి బ్రతిమిలాడింది. అయినా చలనం లేదు. ఈలోగా ఆ కుర్రాడు నీళ్ళలో మునిగిపోవడం, చనిపోవడం జరిగిపోయింది. ఆ తల్లి దుఃఖానికి అవధులు లేవు. తన ఒక్కగాని ఒక్క కుమారుడు కళ్ళముందే కనుమరుగైపోయాడు. ప్రక్కన కాపాడగలిగియూ కాపాడకుండా, రక్షించగలిగియూ రక్షించకుండా వుండిపోయిన అతని మీద కోర్టులో కేసు వేసింది. కోర్టులో విచారణ మొదలైంది. ఆమె జడ్జీ గారిని చూస్తూ అయ్యా! నా ఒక్కగాని ఒక్క కుమారుడు కాలుజారి నీళ్ళలోపడి మునిగిపోతుండగా ఇతనికి ఈత వచ్చినప్పటికీ రక్షించగలిగి కూడా ఎంత బ్రతిమిలాడినను రక్షించకుండా వుండిపోయాడు. రక్షించగలిగియు, కాపాడగలిగియు కాపాడకపోవడం తప్పు కాదా? కళ్ళముందే తోటి మనిషి నశించిపోతుంటే రక్షించగలిగియు రక్షించకపోడం ఘోర పాపం కాదా? అందుకే ఇతన్ని శిక్షించండి అని కోర్టును కోరగా... జడ్జిగారు అతన్ని చూసి నీ వివరణ ఏమిటని అడుగగా అతను... ఎవడో కాళ్ళు జారి నీళ్ళలో పడితే, ఎవడో చచ్చిపోతూ వుంటే రక్షించడం నా పనా? (That is none of my business) అని బదులిచ్చాడట. ఇద్దరి వాదనలు విన్న తర్వాత జడ్జీగారు అన్నారు... చూడమ్మా! అతడు రక్షించగలిగియు, సహాయం చేయగలిగియు సహాయం చేయనంత మాత్రాన తప్పేమీ కాదు. అతడు శిక్షకు అర్హుడు కాడు అని కేసు కొట్టివేశారట. ఎంత ఘోరం!

అయ్యో! ఈ రోజు సహాయం చేయనివారే, మేలు చేయని వారే కరెక్టు అనే స్థితికి లోకం చేరిపోయింది. కానీ బైబిల్ సెలవిస్తుంది "సహాయం చేయనెరిగియు సహాయం చేయని వానికి పాపం కలుగుతుంది. పాపం వలన వచ్చు జీతం మరణం. ఆ తర్వాత నరకం, అంటే సహాయం చేయనెరిగియు చేయని వానికి మరణశిక్ష పడుతుందని బైబిల్ సెలవిస్తుంది.

సహాయం చేయనెరిగియు చేయకపోడం నీ దృష్టికి కరక్టేమోగాని, దేవుని దృష్టిలో మాత్రం అది ఘోరపాపం అని మాత్రం మరిచిపోవద్దు. ఒక్కసారి ఆలోచించు. ఎన్నిసార్లు సహాయం చేయడం నీకు తెలిసికూడా సహాయం చేయకుండా నువ్వు చేయి దాటవేశావో, నీ మాట సహాయం కోసం, ఆర్థిక సహాయం కోసం నీ దగ్గరకు వచ్చిన వారికి సహాయం చేయగలిగి కూడా సహాయం చేయడం వలన నీ సొమ్ము ఏమి పోదు అని తెలిసికూడా సహాయం చేస్తే నాకేంటి లాభం అనే స్వార్థాన్ని చూసుకొన్నావేగాని "మేలు చేయుట నీ చేతనైనప్పుడు దాని పొందగలిగిన వారికి చేయకుండా వెనుక తియ్యకుము. (సామె 3:27) అనే యేసయ్య ఆజ్ఞను అతిక్రమిస్తే పాపం కట్టుకోదా? అది నిన్ను కోర్టు బోనులో నిలువబెట్టదా? "మేలు చేయుటయందు విసుగక యుందము. మనము అలయక మేలుచేసితిమేని తగిన కాలమందు పంట కోతుము" (గల 6:9,10) అని బైబిల్ సెలవిస్తూ వుండగా కనీసం నేటినుండి ఎవరో ఒకరికి ఏదోరీతిగా సహాయం చేయుటకు కంకణము కట్టుకుందామా? ఆదరణతో కూడిన ఒక్కమాట, ప్రేమతో నిరుత్సాహంగా వున్నవాని భుజం తడితే, పరిస్థితులు బాగోక బాధలో ఉన్నవారికి ఒక ఫోన్‌కాల్ చేసి ఓదార్చడం, పూట గడవక అల్లాడుతున్న పేద విశ్వాసికి కొంచెం బియ్యం, చదవాలని వుండి చదువుకోలేని ఓ అభాగ్యుడికి ఫీజు కట్టడం, అనారోగ్యంతో బాధపడుతున్నవానికి అవసరమైన మందులు కొనివ్వడం ఇవన్నీ మేలు చేసే జాబితాయే కదా! ఈ రోజు కూర్చొని ఎన్ని రీతులుగా నీతోటి వానికి మేలు చేయగలవో, ఎవరికి సహాయం చేయగలవో ఆలోచించు! నీ కాలం చెల్లిననాడు నీతో నీ ధన సంపదలు, వెండి బంగారాలు నీ కూడా రావుకానీ నువ్వు చేసిన ఉపకారం, చేసిన మేలు, కనుపరచిన క్రీస్తు ప్రేమ నీతో పరలోకానికి తోడు వస్తుందని మరచిపోవద్దు. "కనుక నేటినుండి మేలుచేసేవాడిగా సహాయం చేసేవాడిగా నిన్ను నీవు కనబరచు, ప్రభువు నామాన్ని ఘనపరచు.

: **ఎడిటర్**

# చిన్నపిల్లలు మరణిస్తే ఎక్కడికి వెళ్తారు?

**ప్రశ్న: చిన్న పిల్లలు చనిపోతే ఎక్కడికెళ్తారు? పరలోకానికా? లేక నరకానికా? ఈమధ్య మా స్నేహితుని కుమార్తె బహు చిన్న వయసులోనే చనిపోయింది. ఆమె ఎక్కడికి వెళ్ళి ఉంటుందనే ప్రశ్న అతన్ని వేధిస్తూనే ఉంది. దయచేసి వాక్యానుసారమైన జవాబు ఇవ్వండి?**



**జవాబు:** మీరు అడిగిన ప్రశ్నకు సరియైన జవాబు ఇచ్చేందుకు అనేక పుస్తకాలు చదివాను. గొప్ప దైవజనులను అడిగాను. ఖచ్చితంగా చిన్నబిడ్డలు పరలోకానికే వెళ్తారనేది బలమైన అభిప్రాయం.

**మొదటి కారణం:** ఆయన ఒక చిన్నబిడ్డను తన యొద్దకు పిలిచి, వారి (శిష్యుల) మధ్య నిలువబెట్టి ఇట్లనెను. "మీరు మార్పునొంది బిడ్డలవంటి వారైతేనేగాని పరలోక రాజ్యంలో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను." (మత్త 18:2,3) మరియు అప్పుడు వారిమీద చేతులుంచి ప్రార్థన చేయవలెనని కొందరు చిన్నపిల్లలను ఆయనయొద్దకు తీసుకొని వచ్చిరి. ఆయన శిష్యులు తీసుకొని వచ్చిన వారిని గద్దింపగా యేసు-చిన్న పిల్లలను ఆటంకపరచక వారిని నాయొద్దకు రానియ్యుడి. పరలోక రాజ్యము ఈలాంటి వారిదని వారితో చెప్పెను. (మత్త 19:12-14; లూకా 18:16) ఈ వచనాల ద్వారా ప్రభువైన యేసు మనకు స్పష్టముగా పిల్లలు ఎక్కడికి వెళ్తారో తెలియజేయుచున్నాడు.

**రెండవ కారణం:** 2వ సమూయేలు 12వ అధ్యాయంలో మీ ప్రశ్నకు సంబంధించిన జవాబును చూస్తాం. "యెహోవా ఊరియా భార్య దావీదునకు కనిన బిడ్డను మొత్తినందున అది బహు జబ్బుపడెను. దావీదు ఉపవాసముండి లోపలికి పోయి రాత్రి అంతా నేలపడియుండి బిడ్డ కొరకు దేవుని బ్రతిమిలాడగా, ఇంటిలో ఎన్నికైనవారు లేచి అతనిని నేలమీద నుండి లేవనెత్తుటకు వచ్చిరి. కానీ అతడు సమ్మతించక వారితోకూడా భోజనం చేయక యుండెను. ఏడవ దినమున బిడ్డ చావగా - బిడ్డ ప్రాణముతో యుండగ మేము అతనితో మాటలాడినప్పుడు అతడు మా మాటలు వినకయుండెను. ఇప్పుడు బిడ్డ చనిపోయెనని మనము అతనితో చెప్పినయెడల హాని చేసికొనక మానడని, దావీదు సేవకులు బిడ్డ చనిపోయెనని సంగతి తెలిసి అతనితో చెప్పవెరచిరి. అయితే దావీదు తన సేవకులు గుసగుసలాడుట చూచి తన బిడ్డ చనిపోయెనని సంగతి గ్రహించి, బిడ్డ చనిపోయెనా అని సేవకులను అడుగగా వారు - చనిపోయెననిరి. అప్పుడు దావీదు నేలనుండి లేచి స్నానము చేసి తైలము పూసుకొని వేరే వస్త్రములు ధరించి యెహోవా మందిరములో ప్రవేశించి మ్రొక్కి తన ఇంటికి వచ్చి భోజనము తెమ్మనగా వారు వడ్డించిరి. అప్పుడు అతను భోజనము చేసెను. బిడ్డకోసం 7 రోజులు ఉపవాసముండి నేలమీదపడి దేవుని సన్నిధిలో గోజాడిన దావీదు బిడ్డ చనిపోగా లేచి స్నానము చేసి తైలము పూసికొని భోజనము చేయుట చదువుచున్న మీకు ఆశ్చర్యము కలుగవచ్చు. కారణం చదువుకుందాం...

"అతని సేవకులు బిడ్డ జీవముతో ఉండగా ఉపవాసముండి దానికొరకు ఏడ్చుచుంటివిగాని అది మరణమైనపుడు లేచి భోజనము చేసితివి. నీవీలాగు చేయుట ఏమని అడుగగా... దావీదు - బిడ్డ ప్రాణముతో ఉన్నప్పుడు దేవుడు నాయందు కనికరించి వానిని బ్రతికించునని ఉపవాసముండి యేడ్చుచుంటిని. ఇప్పుడు చనిపోయెను. గనుక ఇక నేనెందుకు ఉపవాసముండవలెను? వానిని తిరిగి రప్పింపగలనా? నేను వానియొద్దకు పోవుదును (ఎక్కడికి?)గాని వాడు నా యొద్దకు రాడు. ఇక్కడవాని వద్దకు పోవుదును అని అంటున్నాడు దావీదు. ఎక్కడికి వెళ్తాడో ఎక్కడ తాను నివసిస్తాడో కీర్తన 23:6లో చూద్దాం. "చిరకాలము నేను యెహోవా మందిరములో నివాసము చేసెదను." అనగా తన బిడ్డ వెళ్లింది దేవుని సన్నిధికని, తానుకూడా నిరంతరము అక్కడే నివసిస్తానని దావీదు అన్నాడు.

కాబట్టి చిన్న బిడ్డలు మరణించిన తరువాత దేవునితోనే ఉన్నారనే నిరీక్షణ బిడ్డలను పోగొట్టుకున్న హృదయాలకు ఆదరణ కలిగించును గాక!

: డా॥ పి. సతీష్ కుమార్

# దయ్యం పట్టినట్లయితే..?



**దయ్యం పట్టిన వ్యక్తిలో కనిపించే లక్షణాలేమిటి?**

**భౌతిక లక్షణాలు:**

**జవాబు: అ). శూన్యంలో చూపులు:** దురాత్మ పట్టిన మనిషి కళ్ళలో జీవం ఉండదు. ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నట్లు బిత్తర చూపులు చూస్తుంటాడు.

**ఆ). పూనకం:** కొన్నిసార్లు మనిషి పూనకంలోకి వెళ్లిపోతాడు. వాని కళ్ళు మూసుకొనిపోతాయి. కనురెప్పలు ఎత్తిచూస్తే తెల్లగుడ్డు కనిపిస్తుంది.

**ఇ). విపరీతమైన బలం:** గదరేను ప్రాంతంలో దయ్యం పట్టిన మనిషిలాగా (మార్కు 5:3,4) దయ్యం పట్టినవారికి విపరీతమైన బలం ఉంటుంది. ఎంతో అణిగిమణిగి ఉండే బక్కపలచని స్త్రీలు సైతం ఎద్దువంటి శక్తిని పొందుతారు. చెలరేగిపోతూ నానా భీభత్సం సృష్టిస్తారు.

**ఈ). కడుపులో బాధ:** కొందరిలో శరీర సంబంధమైన, ముఖ్యంగా ఉదర సంబంధమైన ఇబ్బందులు కలుగుతాయి. ఉదాహరణకు కడుపులో ఏదో బలంగా పైకి, క్రిందికి కదులుతున్నట్టుగా ఉంటుంది.

**ఉ). వింత ప్రవర్తన:** దయ్యపు శక్తి క్రింద చిన్నపిల్లలు విచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. కోతి దయ్యం పట్టిన పిల్లలు ముఖాన్ని వికారంగా చేసుకొని కోతి ముఖంతో కనిపిస్తూ కుర్చీలు, బల్లల మీద గెంతుతూ ఉంటారు.

**ఊ). ఇనుమడించిన సెక్సు సామర్థ్యం:** దయ్యం పట్టిన వారనేకమందిలో సెక్సు సామర్థ్యం పెరుగుతుంది.

**ఋ). ఊపిరాడనట్టు ఉండడం:** దురాత్మ ఎక్కువ చురుకుగా పని చేస్తున్న సమయంలో దయ్యంపట్టిన వ్యక్తిని తననెవరో గొంతు నులుముతున్నట్లు, ఊపిరాడకుండా చేస్తున్నట్లు లేక రొమ్ము భాగాన్ని బిగించి వేస్తున్నట్టు అనిపిస్తుంది.

**ౠ). గొంతులో స్వరాలు:** దయ్యాలు దగ్గుతాయి, తుమ్ముతాయి, మాట్లాడతాయి, నవ్వుతాయి, బెదిరిస్తాయి, ఏడుస్తాయి, బ్రతిమాలుతాయి, అబద్ధాలాడుతాయి, ఇంకా ఇలాంటివెన్నో చేస్తాయి. (మార్కు 5:5,7,9,10 చూడండి)

**ఎ). ఎదిరింపు:** ఒక మనిషిని ఆవహించియున్న దురాత్మ అతన్ని పడగొట్టి చనిపోయినట్టు కనిపించేలా చేయగలదు. విశ్వాసిని ఆ దురాత్మ బూతులు తిట్టగలదు. అతణ్ణి చూచి కేకలు వేయగలదు. ఎగతాళి చేయగలదు.

**గమనిక:** ఇదంతా నిన్ను నిరుత్సాహ పరచాలని సాతాను చేసే ప్రయత్నమే. దయ్యపు శక్తిపై నీకు అధికారము ఉన్నదా? లేదా అని నీలో సందేహం కలిగించడమే వాడి ఉద్దేశ్యం. (లూకా 4:39; మార్కు 9:18,20,26) దీన్ని పట్టించుకోకుండా క్రీస్తులో నీకున్న అధికారాన్ని ప్రయోగించు.

**ఏ). హింసాత్మక చర్యలు:** అంతేగాక దయ్యం పట్టినవారు మిమ్మల్ని కొరకడానికి, గోళ్ళతో గీయడానికి, తన్నడానికి, కొట్టడానికి ప్రయత్నం చేస్తారు. ఒక విశ్వాసి దయ్యాలను వెళ్ళగొట్టే పద్ధతిని చాలా కష్టమైన పద్ధతిలో నేర్చుకున్నాడు. కళ్ళు మూసుకొని దయ్యాన్ని వెళ్ళగొట్టుతుంటే ముఖంపై సూటిగా దిమ్మ దిరిగిపోయేలా దెబ్బ పడింది.

**ఐ). దుర్వాసనలు:** కొన్నిసార్లు దయ్యం పట్టినవాడిలో నుండి చెడు వాసనలు, ముఖ్యంగా గంధకము వాసన వస్తుంటుంది.

**మానసిక లక్షణాలు:**

**అ). కృంగిపోవడం:** దయ్యం పట్టిన మనిషి తరచుగా కృంగిపోయి ఉంటాడు. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనలు అతనిలో ఉంటాయి. (సౌలు రాజు - యెహోవా యొద్దనుండి దురాత్మ యొకటి వచ్చి అతనిని వెరపింపగా.. సౌలు తన కత్తి పట్టుకొని దానిమీద పడెను. (2సమూ 16:14; 31:4)

**ఆ). దోషభరిత స్థితి:** ఇలాంటి వారిలో సాధారణంగా దోషపూరితమైన మనస్సు, క్షమించలేని మనస్సు, కక్ష మొదలైన లక్షణాలు ఉంటాయి. గారడీ దయ్యం పట్టిన సీమోను గురించిన మాటలను గమనించండి. ''నీవు చేదైన పైత్యములోను... ఉన్నట్టు నాకు కనబడుచున్నది.'' (అపో.కా. 8:23)

**ఇ). విపరీతమైన ఉద్రేకం:** వీరిలో కొంతమందికి భయంకరమైన కోపం ఉంటుంది. చాలా త్వరగా ఇతరులపై మండిపడుతుంటారు. ''యెహోవా యొద్దనుండి దురాత్మ సౌలు మీదికి వచ్చెను... సౌలు ఒకే దెబ్బతో దావీదును

గోడకు పొడుచుదునన్న తాత్పర్యం కలిగి ఈటె విసిరెను." (1సమూ 19:10)

**మేధస్సు సంబంధమైన సంఘర్షణ, గలిబిలి:**

దయ్యం అదుపులోవున్న మనుష్యుల్లో తరచుగా మానసిక సంఘర్షణ, గందరగోళం నెలకొని ఉంటాయి. ఈ యుగ సంబంధమైన దేవత అవిశ్వాసులైన వారి మనోనేత్రాలకు గ్రుడ్డితనము (గ్రీకులో 'పోరూ' అనే పదం వాడబడింది. దీనికి అర్థం బుద్ధిమాంద్యం) కలుగజేసెను. (2కొరిం 4:4)

**ఆధ్యాత్మిక లక్షణాలు:**

**అ). దేవుని వాక్యంపట్ల వ్యతిరేకత:** సాధారణంగా దయ్యం పట్టిన మనిషిలో దేవుని వాక్యంపట్ల వ్యతిరేకత ఉంటుంది.

**ఆ). చూచే దయ్యాలు:** ఆఫ్రికా ప్రాంతంలో దయ్యంపట్టిన వాళ్ళు కొంతమంది "నాకు మరుగుజ్జు వంటి మనుషులు కనిపిస్తున్నారు" అని చెబుతారు. వాటిని 'టికొలోషి' అంటారు.

**అవసరమైన/ఆత్మసంబంధమైన సహాయం:** దయ్యాల శక్తులను, లేక దురాత్మలను గుర్తించడం ఎలాగో పౌలు, యోహాను కొన్ని సహాయకరమైన సూచనలను ఇస్తున్నారు.

**1. ఆ మనిషి మాట్లాడే మాటలనూ, స్వరాన్ని గమనించండి:** "దేవుని ఆత్మవలన మాట్లాడు వాడెవడును యేసు శాపగ్రస్థుడని చెప్పడనియు... నేను మీకు తెలియజేస్తున్నాను." (1కొరిం 12:3) చాలాసార్లు ఒక మనిషి ఉపయోగిస్తున్న భాష, అతని స్వరం మొదలైన వాటినిబట్టే వేరొక వ్యక్తిత్వం (దయ్యం) అతన్ని ఆవహించి ఉందని అర్థమైపోతుంది.

**2. వాటి ఒప్పుకోలును పరీక్షించండి:** ఒక వ్యక్తి ఆత్మ అదుపు క్రింద ఉంటే ఈ పరీక్ష పనిచేస్తుంది. ప్రతి ఆత్మను నమ్మక ఆయా ఆత్మలు దేవుని సంబంధమైనవో కావో పరీక్షించుకోండి.

"యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని, ఏ ఆత్మ ఒప్పుకొనునో అది దేవుని సంబంధమైనది ఏ ఆత్మ ఒప్పుకొనదో అది దేవుని సంబంధమైనది కాదు". (1 యోహా 4:1-3)

**: రాల్ఫ్ మహోని**

# మన తాతముత్తాతల వయస్సు ఎంతో తెలుసా..?

**మన తాత ముత్తాతల వయస్సు ఎంతో తెలుసా..?**



1. ఆదాము తాతగారిది 930 సం॥లు (ఆది 5:5)
2. షేతు తాతగారిది 912 సం॥లు (ఆది 5:8)
3. ఎనోషు తాతగారిది 905 సం॥లు (ఆది 5:11)
4. హనోకు తాతగారిది 365 సం॥లు (ఆది 5:23)
5. మెతూషెల తాతగారిది 969 సం॥లు (ఆది 5:27)
6. లెమెకు తాతగారిది 777 సం॥లు (ఆది 5:31)
7. నోవహు తాతగారిది 950 సం॥లు (ఆది 9:29)

**జలప్రళయం తరువాత:**

1. షేము తాతగారిది 600 సం॥లు (ఆది 11:10,11)
2. ఏబెరు తాతగారిది 464 సం॥లు (ఆది 11:16,17)
3. తెరహు తాతగారిది 205 సం॥లు (ఆది 11:32)
4. అబ్రహాము తాతగారిది 175 సం॥లు (ఆది 25:7)
5. ఇస్సాకు తాతగారిది 180 సం॥లు (ఆది 35:28)
6. యాకోబు తాతగారిది 147 సం॥లు (ఆది 47:28)
7. యోసేపు తాతగారిది 110 సం॥లు (ఆది 50:26)

**చివరకు:** "మా ఆయుష్కాలము డెబ్బది సంవత్సరములు. అధిక బలమున్న యెడల ఎనుబది సంవత్సరములు. అయినను వాటి వైభవము ఆయాసము దుఃఖమే." (కీర్త 90:10)

# ఎవరుబడితే వారివెంట...



ఓ అమెరికా దేశస్థుడు సిరియా దేశాన్ని సందర్శిస్తూ వుండేవాడు. అక్కడ ముగ్గురు గొఱ్ఱెల కాపరులు తమ గొఱ్ఱెలను మేపుతూ వున్నారు. అన్ని గొఱ్ఱెలు కలిసి మేతమేస్తూ, అలాగే కలిసి అక్కడ ఉన్న వాగులోని నీరు త్రాగుతూ వున్నవి. సాయంకాలం అవుతున్నప్పుడు ఒక గొఱ్ఱెల కాపరి లేచి మే... మే... అని అరిచాడట. అంతే! తన గొఱ్ఱెలన్నీ ఆ మందలోనుండి వేరై తనను వెంబడించడం మొదలు పెట్టెనట. ఆ తర్వాత కాపరి మే... మే... అని అనగా అవికూడా ఆ మందలోనుండి వేరై ఆ గొఱ్ఱెల కాపరిని వెంబడించెనట. ఏ గొఱ్ఱెలు ఆ గొఱ్ఱెల కాపరిని వెంబడించెను. ఇది గమనించిన ఆ అమెరికా పర్యాటకుడు మిగిలివున్న ఆ మూడవ గొఱ్ఱెల కాపరి దగ్గరకు వెళ్ళి నీ తలపాక, నీమీద వున్న ఆ కంబళి ఆ కఱ్ఱ నాకు ఇవ్వు అని వాటిని ధరించి ఆ గొఱ్ఱెల కాపరివలె మే... మే... అని అరిచెనుగాని ఒక్క గొఱ్ఱెకూడా అతనివైపు చూడలేదు, అతన్ని వెంబడించలేదు. అది గమనించిన ఆ యాత్రికుడు... అయ్యా! మీ గొఱ్ఱెలు వేరే వారిని వెంబడించవా? అని ప్రశ్నించగా అందుకు ఆ కాపరి... ఏ గొఱ్ఱెనా రోగంతో వుంటే తప్ప ఆరోగ్యంగా వున్న గొఱ్ఱె వేరే కాపరిని వెంబడించదు అని బదులిచ్చెనట.

అవును, ఆరోగ్యంగా వుండే గొఱ్ఱెలు వేరే కాపరిని వెంబడించవు. ఎందుకంటే మంచి కాపరి తన గొఱ్ఱెలను పోషిస్తాడు, కాపాడుతాడు, నడిపిస్తాడు, వాటిని తన ప్రాణంగా ప్రేమిస్తాడు. అంత మంచి కాపరిని ఆరోగ్యంగా ఉండే ఏ గొఱ్ఱె విడిచిపెట్టదు. అలాగే ప్రేమించే, పోషించే, కాపాడే సంఘకాపరిని ఆత్మీయంగా ఆరోగ్యంగా వుండే ఆత్మీయ గొఱ్ఱెలు అనగా విశ్వాసులు ఆ సంఘాన్ని, ఆ సంఘ కాపరిని విడిచిపెట్టరు. కొన్నిసార్లు ఆత్మీయ రోగం వచ్చినప్పుడు... అనగా తనకు పెత్తనం దొరకనప్పుడు, తన మాట చెల్లుబాటు కానప్పుడు, పాపాన్ని సరిచేసినప్పుడు, తనకు బైబిల్ రీడింగ్ ఇవ్వనప్పుడు, తన ఆటలు సాగనప్పుడు... ఆత్మీయ రోగంతో వున్న ఆ విశ్వాసి ఆరోజు వరకు ఆ కాపరిని ఎంతగా పొగడినా, మా కాపరి చాలా మంచివాడు, గొప్పగా వాక్యం చెబుతారు అని పదిమందికి చెప్పి సంఘానికి నడిపించినప్పటికీ తన ఆటలు సాగకపోయేసరికి, లేదా ఏదో విషయంలో గాయపడి ఆ సంఘాన్ని విడిచి వేరే సంఘానికి వెళ్తారు. వీరు ఎవరంటే జబ్బుపడిన గొఱ్ఱెలు.

కొన్ని ఆరోగ్యవంతమైన గొఱ్ఱెలు తమ కాపరిని, సంఘాన్ని విడిచిపెట్టి మంచి కాపరుల దగ్గరకు చేరుతూ ఉంటాయి. అందుకు కారణం ఏమిటంటే... మంచి కాపరి తన గొఱ్ఱెల కొరకు ప్రాణం పెట్టును. మంచి కాపరి ఎవరంటే ఆత్మీయంగా చక్కని వర్తమానములతో, ప్రయాసతో, కన్నీటితో వాక్యము అనే పచ్చిక బయళ్ళచేత తృప్తి పరచేవాడు. తన గొఱ్ఱెలకు కష్టం వచ్చినప్పుడు, రోగం వచ్చినప్పుడు, వేదనతో, భారముతో ప్రార్థించి దుష్టునియొక్క హస్తాలనుండి తన గొఱ్ఱెలను కాపాడుకొనేవాడు. అంతేకాకుండా తన గొఱ్ఱెలను మంచి బాటలో మంచి ఆత్మీయతతో నడిపించేవాడు. కాని ఎప్పుడైతే కాపరి ఈ శ్రేష్ఠమైన లక్షణాలు లేకుండా... అనగా వాక్యము భారముతోను, కన్నీటితోను తన గొఱ్ఱెలకు అర్థమయ్యే విధంగా వారి అవసరము తెలుసుకొని బోధించలేదో రుచి లేకుండా పసలేకుండా చెబుతుంది తనకు అర్థంకాక వినేవాడు గ్రహించలేని విధంగా బోధిస్తూ నెలకు నాకు కావలసిన జీతం వస్తుంది చాలు! అనే దృక్పథంతో సేవచేసే సేవకులు, డబ్బున్నవారి గృహాలను మాత్రమే దర్శిస్తూ, పేదల ఇళ్ళను నిర్లక్ష్యం చేస్తూ కులమును బట్టి, వారికున్న కలర్‌ను బట్టి, ఆస్తిపాస్తులను బట్టి సంఘస్థులను సమానంగా చూడవలసిన కాపరులు తన గొఱ్ఱెలపట్ల విచక్షణ చూపేవారు సేవకులు, కాపరులు కానేకారు. అటువంటి వారిని చూసి దేవుడు ఇలా అన్నాడు. "నా మందలో చేరిన గొఱ్ఱెలను నశింపచేయుచు చెదరగొట్టు కాపరులకు శ్రమ. మీరు నా గొఱ్ఱెలను గూర్చి విచారణ చేయక, నేను మేపుచున్న గొఱ్ఱెలను చెదరగొట్టి పారద్రోలితిరి. ఇదిగో మీ దుష్క్రియలనుబట్టి మిమ్మును **(....మిగతా 7వ పేజీలో)**

# పరిశుద్ధ జీవితానికి పండంటి సూత్రాలు

1. ఉదయం, సాయంత్రం ప్రార్ధనలో తప్పక గడపాలి.
2. పనిపాటు లేకుండా ఒక్కక్షణం కూడా వృధా చేయవద్దు.
3. పేరుకోసం, గుర్తింపుకోసం ఏ పని చేపట్టవద్దు.
4. దేవునికి ఇష్టం కానిది చేయడానికి ఎప్పుడూ సాహసించవద్దు.
5. తోటి విశ్వాసుల మేలు కొరకు, ఆత్మీయ అభివృద్ధి కొరకు త్యాగపూరితమైన జీవితం కలిగియుండు.
6. సువార్త కొరకుగాని, క్రీస్తు కొరకుగాని ఎటువంటి శ్రమనైనను అవమానమైనను భరించుటకు సిద్ధముగా యుండు.
7. అపవిత్రమైన తలంపులను, చూపులను దరి చేరనీయకు.
8. ఎప్పుడూ వాక్యమును, ఆత్మీయ పుస్తకములను చదువుతుండు.
9. సూర్యుడు ఉదయిస్తుండగానే లేవాలి, మోకాళ్ళూనాలి.
10. నీ శరీరమునకు అవసరమైనంత మట్టుకే తిను, మితిమీరి తినకు - అదోనిరామ్ జడ్సన్.

**(6వ పేజీ తరువాయి...)**

శిక్షించబోతున్నాను.'' (యిర్మి 23:1-2) ''గొఱ్ఱెలు గొఱ్ఱెల కాపరి స్వరము వినును. గనుక అతనిని వెంబడించును. అన్యుల స్వరము నెరుగవు గనుక అవి అతని వెంబడించవు'' (యోహా 10:3-5)

సామాన్యజనులు బలాత్కారము చేయుచు దొంగిలించుదురు. వారు దీనులను దరిద్రులను హింసించుదురు. యెహోవా సెలవియ్యకపోయినను - ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడని చెప్పుచూ వట్టి సోదెగాండ్రయి వ్యర్థమైన దర్శనములు కనుచు జనులు కట్టిన మంటిగోడకు గచ్చుపూత పూయువారై యున్నారు. (యెహె 22:26-28)

అంతేకాకుండా ''జీతగాడు గొఱ్ఱెల కాపరి కాడు. గనుక గొఱ్ఱెలు తనవి కానందున తోడేలు వచ్చినప్పుడు చూచి గొఱ్ఱెలను విడిచి పారిపోవును. తోడేలు ఆ గొఱ్ఱెలను చెదరగొట్టును. జీతగాడు జీతగాడే గనుక గొఱ్ఱెలను గూర్చి లక్ష్యము చేయక పారిపోవును. (యోహా 10:12,13) అని యేసయ్య చెప్పెను.

ప్రియ చదువరీ! మంచి కాపరి నీకు వున్నప్పటికీ నీకున్న రోగాన్నిబట్టి నీ ఆటలు సాగడం లేదని ఆ సంఘాన్ని, ఆ దీన సేవకున్ని విడిచిపెడితే వేరే సంఘాల్లో కూడా నీ ఆటలు సాగకపోతే ఏం చేస్తావు? 'దొర్లే రాయి ఎక్కడా నిలబడదట.' కనుక దొర్లే రాయిగా ఉండక క్రీస్తు అనే బండపై కట్టబడిన ఆత్మీయతను కలిగి స్థిరముగా జీవించు.

ప్రియ సేవకా! మంచి విశ్వాసులు మనలను విడిచి వెళ్ళిపోతూవున్నట్లైతే వారిని చూచి ఏడవకు. మనలో వున్న లోపమేదో కనుగొని జీతగాడివిగా కాక, మంచి కాపరిగా మనలను మనం కనుపరచుకొనుటకు ప్రయాస పడుదాం. మంచి కాపరి గొఱ్ఱెలు ఆ కాపరి స్వరమే వింటాయని, అవి వేరే వారిని వెంబడించవని యేసయ్య చెప్పాడు. ఒకవేళ నీ గొఱ్ఱెలు రోగంతో బయటకుపోతే మంచి గొఱ్ఱెలను కాపాడుకొందాం. మంచి గొఱ్ఱెలు మన రోగాన్ని చూసి వెళ్ళిపోతే మనల్ని మనం సరిచేసుకొందాం! భళా! నమ్మకమైన మంచి దాసుడా! అని యేసయ్య చేత అనిపించుకొందాం.

చివరిగా..... ఈ వర్తమానం సారాంశమేమనగా... జబ్బు గొఱ్ఱెలు మంచి కాపరిని విడిచి పెడతాయి. మంచి గొఱ్ఱెలు జబ్బు కాపరిని విడిచిపెడతాయి.

**- డా॥ సతీష్ కుమార్**

## కల్వరి క్రాంతి పాఠకులకు గమనిక:

**ఈ పరిచర్యలో ఉన్న ఒత్తిడిని బట్టి, మరియు ఆయా ప్రదేశాలలో కల్వరి మహోత్సవాలు నిర్వహించడం వల్ల గత జూలై- ఆగస్ట్ 2007 పత్రికను ప్రచురించలేకపోయినందులకు చింతిస్తున్నాము. మీలో అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్ ద్వారా పత్రిక కొరకు ఎంతో ఎదురు చూస్తున్నామని తెలియజేసినందుకు మీకు వందనములు.**

ఓ తండ్రి కన్నీటి గాథ !

# ఆయన మా నాన్న కాదు

ఈమెకు అర్ధమౌనా ఆ వ్యథ !!

యవ్వనస్తులకు మాత్రమే!


(ఇది కథ కాదు)

అతనో పేదోడు, కాని మంచితనంలో తనంత ధనికుడు ఎవరు లేరు. తానో మొరటోడు కాని తనకున్నంత మెత్తని మనసు మరొకరికి లేదు. అతనికి కష్టమంటే ఏంటో తెలుసు. కడుపుమంట ఎలా ఉంటుందో ఇంకా బాగా తెలుసు. అందుకే తన బిడ్డ తనలా బతకకూడదని, కడుపు మంటతో మాడకూడదని తలంచేవాడు. తాను పేదవాడైనప్పటికీ తన కూతురు మాత్రం పైకి రావాలని కలలు కనేవాడు.

తాను చేసేది కూలిపని. తన బిడ్డ మాత్రము ఎన్నడు కాని పని చేయకూడదని గొప్పగా ఊహించుకొనేవాడు. అందుకే అది ఎంత కష్టమైనా తనకున్న ఒక్కగానొక్క కూతుర్ని బాగా చదివించాలని, గొప్ప చేయాలని తలంచి స్కూల్ చదువైన వెంటనే పై చదువులకు తన కూతుర్ని పట్టణము పంపించాడు. ఒరేయ్! నీ కూతుర్ని పట్నం పంపిస్తున్నావ్ డాక్టర్ని చేద్దామనా? లేక కలెక్టర్ని చేద్దామనా? నీకే పూట గడవడం అంతంతమాత్రం, ఆశకైనా హద్దులుండాలిరా! అని ఓ పెద్దాయన అంటుంటే హృదయంలో ఎంతో నొచ్చుకున్నాడు. తాను పేదవాడిననేగా వీరికి ఇంత లోకువ. ఏం! పేదవాడి కూతురు చదువుకోకూడదా? పేదవాడి కూతురు డాక్టరు కాకూడదా? ఏమైనాసరే! నా రక్తం చిందించైనా నా కూతుర్ని డాక్టర్ని చేస్తాను. గొప్పదానిగా చూస్తాను. నాలాగ నా బంగారుతల్లి కష్టపడకూడదు. ఆకలిమంటతో అలమటించకూడదు. అనేకమంది ఆకలి తీర్చేదిగా నా కూతురు కీర్తిని సంపాదించాలని ఆశపడి తన కూతురుకు కీర్తి అని పేరు కూడా పెట్టుకున్నాడు.

ఏమే మీ నాన్నగారు ఏం చేస్తారు? అని అడిగింది గీత. మా నాన్నగారు వ్యవసాయం చేస్తారు. మాకు రెండు ఎకరాల పొలంవుంది. దాన్ని చూసుకుంటారు అని అంది స్నేహ! మరి మీ నాన్నగారు! అని ఎదురు ప్రశ్న వేసింది. మా నాన్నగారు ఓ ఆర్.ఎం.పి. డాక్టరు. మాది మధ్య తరగతి కుటుంబం అని జవాబిచ్చింది గీత. స్నానంచేసి బయట కొచ్చిన కీర్తిని చూసి వాళ్ళు, కీర్తి మీ నాన్నగారు ఏం చేస్తుంటారని ఒక్కసారిగా అడిగారు. అందుకు కీర్తి ఎంతో గర్వంగా నవ్వుతూ మా నాన్నగారు మాఊరి ప్రెసిడెంట్, మాకు 25 ఎకరాల పొలముంది. మాఇంట్లో ఎంతోమంది కూలివాళ్ళు పని చేస్తారు. మా గురించి చెప్పాలంటే చాలా వుందిలే... అలా మాట్లాడుతుంటే ఆశ్చర్యముగా చూస్తూ వుండిపోయి గీత, స్నేహల నోటిలో మాట రాలేదు. గీత, స్నేహ మాత్రం చక్కగా చదువుకునేవారు కానీ, కీర్తి సరిగా క్లాస్‌లకి అటెండయ్యేది కాదు. సరిగా చదువుకోదు. పంపించిన డబ్బంత సినిమాలకు, చెడు పుస్తకాలకు, సినిమా క్యాసెట్స్‌కి సరిపోతుండేది. పైగా అబ్బాయిలతో స్నేహము, వారిని సినిమాలకు, హోటల్స్‌కి తీసుకువెళ్ళడం వారికి అయ్యే ఖర్చంతా తానే చెల్లించేది. హాస్టల్‌కి చాలా ఆలస్యంగా వచ్చేది. కొన్ని రాత్రులు అసలు వచ్చేది కాదు. ఎన్నోసార్లు గీత, స్నేహ ఇద్దరూ కీర్తిని మందలించారు. నువ్వేదో బాగా చదువుకొంటావని, పైకొస్తావని మీ నాన్నగారు నిన్ను పట్టణానికి పంపిస్తే నువ్వు ఈ విధంగా తిరగడం మంచిది కాదు. అందుకు కీర్తి, చూడండి! జీవితం అనేది ఐస్‌క్రీమ్ లాంటిది. టైమ్‌కి అనుభవించకపోతే కరిగిపోతుంది. ఈ వయస్సు ఈ సరదాలు మరలా జీవితంలో తిరిగిరావు. కనుక ఎంజాయ్ చేయాల్సిన సమయంలో ఎంజాయ్ చేయాలి అని వాళ్ళ నోళ్ళు మూయించింది.

తన దుబారా ఖర్చులకు తన తండ్రి పంపించే డబ్బులు సరిపోక, ఇంకా డబ్బులు కావాలని పుస్తకాలు కొనుక్కోవాలని, ప్రైవేట్ క్లాసులకు ఎక్స్‌ట్రా ఫీజులు చెల్లించాలని ఏవేవో కట్టు కథలు అల్లి ఉత్తరాలు వ్రాసేది. అక్కడ

కూలినాలి చేసుకొని కడుపు నింపుకొనే తండ్రి తన కూతురు కష్టపడకూడదని కాలేజ్ ఫీజు నిమిత్తము ఓపూట భోజనం చేయడం ఎప్పుడో మానేసాడు. ఇప్పుడు ఇంకా డబ్బులు పంపాలంటే కొన్ని రోజులు సొంతం పస్తులుండాల్సిందే! తండ్రి కడుపు మాడ్చుకొని పచ్చి నీళ్ళతో కడుపు నింపుకొని తన కూతురు గొప్పగా చదువుకొని కీర్తి సంపాదిస్తే అదే చాలు. నేను ఉంటే ఏమి, ఊడిపోతే ఏమి... నా కూతురు చల్లగా బ్రతికితే అదే పదివేలు... అని ప్రతి పైసా కూడబెట్టి తన కూతురికి పంపేవాడు. కీర్తి తన స్థితిగతి ఎప్పుడో మర్చిపోయింది. అహం, గర్వంతో కళ్ళు కానక జీవించడం మొదలుపెట్టింది.

ఓరోజు తన కన్న కూతురు ఎలా ఉందో చూసి చాలాకాలం అయింది అని ఊహించి, ఓసారి వెళ్లి వద్దామని తన కూతురికి ఇష్టమైన లడ్డులు, చకోడీలు తయారుచేసుకొని, ఎప్పుడు కూతుర్ని చూస్తానా? అని ఆత్రంగా పట్టణం బయలుదేరాడు. నా కూతురు బాగా చదువుకొంటుంది. నా ఆశలను, నా ఆశయాలను, పరువును నిలబెడుతుంది. పేదవాడు కూడా కూతుర్ని గొప్ప చదువు చదివించగలడని నా కూతురు నిరూపిస్తుందని కలలు కంటూ, కాలేజీ హాస్టల్‌కు చేరాడు. అమ్మా! ఇక్కడ కీర్తి మా అమ్మాయి ఎక్కడ వుంది అని ప్రశ్నించాడు గీతను. గీత ఆశ్చర్యపడుతూ... కీర్తి మీ అమ్మాయా? ఓ గంటలో వస్తుంది అని జవాబిచ్చింది. ఆ గంట ఎంత త్వరగా అవుతుందా? అని ఎప్పుడు తన కూతురును చూస్తానా? అని వేయి కళ్ళతో ఎదురుచూసాడు.

ఎప్పుడో పొద్దున తిన్నాడు చద్దన్నం. ఓప్రక్క అలసటతో కంటికి కునుకు పడుతున్న తన కూతురుకోసం కళ్ళార్పకుండా చూస్తున్నాడు. గంటయింది, రెండు గంటలయ్యింది... రాత్రి 12 గం॥లకు ఏదో మోటారు సైకిల్ శబ్ధమైతే ఆశతో చూసాడు. ఆ కుర్రాడి బైక్‌మీద నుండి క్రిందికి దిగి హాస్టల్‌కి రాబోతుంటే... వాడు తన కూతురు చేయిపట్టుకొని లాగడం తన కళ్ళముందే సరసాలాడడం చూసి గుండె ద్రవించిపోయి, కుప్పకూలిపోయాడు. ఆ ప్రక్కన కూర్చున్నది తన తండ్రని గ్రహించక తన తండ్రి ముందునుంచే హాస్టల్‌కు వెళ్ళిపోయింది కీర్తి. ఏమే! నీకోసం మీ నాన్నగారు వచ్చారు. చూశావా? అని అడిగింది గీత. మా నాన్నగారా? చూద్దాంరా! అని గీత, స్నేహలతో కలిసి క్రిందికి వచ్చింది కీర్తి. అప్పటికే సగం చచ్చిపోయిన ఆ ముసలాయనను చూచి నిద్రపోతున్నాడేమో అనుకొని ఈయన మా నాన్నకాదు, ఈయన మా ఇంట్లో పనివాడు. నేను మాట్లాడి వస్తాను మీరు పదండి అని వారిని పంపించింది కీర్తి. తన తండ్రి దగ్గరనుండి తనకు కావలసిన డబ్బులు తినుబండారాలు తీసుకొని ఆ రాత్రికి రాత్రే తండ్రిని పంపించేసింది. నడుస్తున్నాడుకానీ, తన కళ్ళముందు ఆ కుర్రాడు కూతురు బరితెగించిన.... ఆ దృశ్యం, ఇతను మా నాన్నకాదు పనివాడు అనే మాటలు, తన చెవుల్లో మారుమ్రోగుతూ శూలాల్లాగా గుచ్చుకొంటున్నాయి. అడుగు వేయలేకపోతున్నాడు. ఆ పేద గుండె క్షోభను తట్టుకోలేకపోయింది.... ఛీ! ఛీ! కూతుళ్ళు పుట్టాలి కాని నాలాంటి కూతురు ఏ తండ్రికి పుట్టకూడదు... అంటూనే ఆ నోరు మూగబోయింది.

ప్రొద్దున హాస్టల్ దగ్గర్లో వున్న రైలు పట్టాల దగ్గర జనం మూగారు. కాలేజ్‌కి వెళ్తూ ఏం జరిగిందో చూద్దాం అని గీత, స్నేహలతో కలిసి జనంలోంచి తొంగి చూసింది కీర్తి. ఇంకెవరు తన తండ్రి! నాన్నా... అంటూ ఏడుద్దామంటే పనివాడని అబద్ధం చెప్పాను. ఇప్పుడు నాన్న అంటే ఉమ్మేస్తారు. తన కళ్ళముందే మున్సిపాలిటి వారు తన తండ్రి శవాన్ని తీసుకెళ్తుంటే... కన్న కూతురి కన్నీటికి కూడా నోచుకొని ఆ పేద తండ్రి దిక్కుమాలిన వాడిగానే తీరని లోకానికి వెళ్ళిపోయాడు.

ప్రియ చదువరీ! నీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకొని, వారి రక్తాన్ని చెమటగా మార్చి నీవు బాగా చదువుకోవాలని, బాగుపడాలని నిన్ను కాలేజ్‌కి పంపిస్తే నువ్వు చేస్తుందేమిటీ? నువ్వు కూడా కీర్తి లాగే జీవిస్తే నీ తండ్రి కూడా కీర్తి తండ్రిలాగే...! ఊహించగలవా...???? అందుకే....
దయచేసి, నేడైనా దేవునియందు భయభక్తులు కలిగి యోసేపువలె పాపానికి రాజీపడక గొప్ప కీర్తిని సంపాదించి క్రైస్తవ లోకం గర్వించే విధంగా దేవునికి మహిమకరంగా జీవించి నీ తల్లిదండ్రులను సంతోషపెడతావని ఆకాంక్షిస్తున్న.....

మీ **సతీషన్న**

ఓ పనిపిల్ల సాక్ష్యం

# మంచం క్రింద కూడా ఊడుస్తాను

ఒకరోజు ఓ పనిపిల్ల గొప్ప దైవజనుడైన చార్లెస్ స్పర్జన్ గారి దగ్గరకు వచ్చి వారు నడిపించే సంఘములో సభ్యత్వం ఇవ్వమని కోరెనట. మొదటిసారి ఒప్పుకొనకపోయినప్పటికీ తర్వాత ఆమె అడిగినప్పుడు అమ్మా! నువ్వు మార్పు చెందిన వ్యక్తివి అని చెప్పడానికి నువ్వు చూపే రుజువు ఏమిటి అని అడుగగా ఆమె... అయ్యా! నేను ఒక పనిపిల్లను, మార్పు చెందకముందు సరిగా ఇల్లు ఊడ్చేదానను కాను. కాని ఇప్పుడు మంచం క్రింద, సోఫా క్రింద, కార్పెట్ క్రిందకూడా శుభ్రముగా ఊడుస్తున్నాను అని అనెనట. మార్పు చెందాను అని చెప్పుచూ ఆ పిల్ల చెప్పిన ఉదాహరణకు స్పర్జన్ నవ్వుకొని ఆమెకు సభ్యత్వము ఇచ్చెనట.



ప్రియ చదువరీ! నేను మారాను, రక్షించబడ్డాను, బాప్తీస్మము కూడా తీసుకున్నాను, భాషల్లో మాట్లాడుతున్నాను, దర్శనాలు కూడా చూస్తున్నాను అని అంటున్నావు మంచిదే! కాని ఇతరులు నీలో వచ్చిన మార్పును నీ క్రియల్లో చూడగలుగుతున్నారా? నీ మాటల్లో మార్పు, నీ చేతల్లో మార్పు, నడకలో పడకలో మార్పు, నీ వేష భాషలో మార్పును గమనించగలుగుచున్నారా? నీలో వచ్చిన మార్పును నీ ఇంటివారే చూడలేకపోతున్నా లేక నమ్మేటట్టు లేకపోయినట్లయితే బహుశా నీ మార్పు సంపూర్ణమైనది కాదేమో పరీక్షించుకో?

గెరాసేనుల దేశములో సమాధుల్లో 'సేనా' అనే దయ్యముచేత బంధించబడినవాడు క్రీస్తుద్వారా మార్పును పొందినప్పుడు అతడు స్వస్థచిత్తుడై వస్త్రము ధరించి కుదురుగా కూర్చుండుట చూచి ఇంటివారు, బయటివారు మరియు దెకపొలి వారు చూచి ఆశ్చర్యపడ్డారు. అవును, దేవుని ద్వారా ఒక వ్యక్తి దర్శింపబడ్డా, మార్చబడ్డా ఆ వ్యక్తి అనేకులకు ఆశ్చర్యాన్ని పుట్టిస్తాడు. ఇలాంటి త్రాగుబోతు ఇలాంటి తిరుగుబోతు, ఇటువంటి లంచగొండి, అబద్ధికుడు ఇంతగా మారాడా? ఆ యేసు ఇటువంటి పాపిని కూడా మార్చగలడా? అని నిన్ను చూసినవారు ఆశ్చర్యపడుతూ దేవుని శక్తిని బట్టి ఆయనను మహిమపరచగలగాలి. లేదా యేసు ఎంతగొప్పవాడో తెలుసుకోగలగాలి. మరి నీ మార్పు సంగతేమిటి? నీ మార్పువల్ల దేవుడు మహిమ పరచబడుతున్నాడా? నీ చుట్టూవారు నీ సాక్ష్యాన్ని విని నీలో వచ్చిన మార్పును చూసి ఆశ్చర్యపడుతున్నారా? సమరయ స్త్రీలో వచ్చిన మార్పు ఆమె చెప్పిన సాక్ష్యం ఆ ఊరినంతా క్రీస్తు దగ్గరకు నడిపించింది. మరి నీ సాక్ష్యం, నీ జీవితం నీ ఊరినంతటిని కదిలించకపోయినా కనీసం నీ ఇంటివారినైనా క్రీస్తు దగ్గరకు తీసుకొని రాగలుగుతున్నదా? నీలో వచ్చిన మార్పునుబట్టి నీవు కలిగియున్న ఆత్మీయతనుబట్టి, ప్రార్థనా జీవితాన్నిబట్టి, నువ్వు ఏ సంఘానికి సభ్యునిగా వున్నావో ఆ సంఘ కాపరి నిన్ను బట్టి, నీలో వచ్చిన మార్పును బట్టి సంతోషించి, దేవున్ని స్తుతించగలుగుతున్నారా? ఆలోచించు! నీ మార్పు నిన్ను నీ చుట్టూ వున్నవారిని ఆశ్చర్యగొలుపకపోతే బహుశా నువ్వు క్రీస్తు ద్వారా మార్పుచెంది యుండకపోవచ్చు. ఒక్కసారి పరీక్షించుకో!

: డా॥ పి.సతీష్ కుమార్

**మేము మీకు పంపే పత్రిక కవరుపైనున్న లేబుల్‌మీద మీ పత్రిక యొక్క సాలు చందా గడువు ఎప్పుడు ముగుస్తుందో వ్రాసి ఉంటుంది. ఉదా:- (16524) (EXP. OCT 2007) అని ఉంటే : అక్టోబర్ 2007 నాటికి మీ పత్రిక చందా గడువు తేదీ ముగిసిందని అర్థం. కాబట్టి మీరు ఇప్పుడే కవరు పైనున్న లేబుల్‌ను చూసి మీ పత్రిక గడువు ముగిసినట్లయితే దయచేసి వెంటనే రెన్యువల్ చేసి ఈ పత్రిక పరిచర్య మాకు మరింత భారం కాకుండా సహాయపడగలరని మనవి.**

# సాతానంటే నాకు భయమా ?



ఒకాయన అప్పుడే వేదాంత విద్యను ముగించుకొని ఓ సంఘానికి పాష్టరుగా చేరాడు. తాను మంచి ప్రసంగీకుడనని వారికి తగిన పాష్టరు అని అనిపించుకొనుటకు తన ప్రసంగాన్ని (సాతాను గురించి అయితే బాగుంటుందని తలంచి) రాత్రంతా కుస్తీపడి ప్రసంగము సిద్ధము చేసుకొని  చర్చికి వచ్చి ప్రసంగించుట మొదలుపెట్టెను.

ప్రియులారా! సాతాను ఎవరిని మ్రింగుదునా అని గర్జించు సింహమువలె తిరుగుచున్నాడని బైబిల్ సెలవిస్తుంది. అంతేకాదు వాడు మొదటనుండి  హంతకుడు, అబద్ధికుడు, దొంగ, మోసగాడు, తంత్రగాడు, మీ జీవితాలను కుటుంబాలను బిడ్డలను చివరికి మన సంఘాన్ని నాశనము చేయుటకు కంకణము కట్టుకొని తిరుగుచున్నాడు. అయినను మీరేం భయపడనవసరము లేదు. ఎందుకంటే నా కసలు సాతానంటే భయమేలేదు అది మీకు తెలుసా? అని గర్వంగా అందరిని చూస్తూ అన్నాట్ట.

ఆ ప్రసంగాన్ని జాగ్రత్తగా వింటున్న  ఓ పెద్దాయన..... అయ్యా! మీరు సాతానుగాడికి భయపడతారో లేదో మాకనవసరము. ఇంతకీ మీకు సాతాను భయపడతాడో లేదో చెప్పండి. మీ జవాబు మీద మా సంఘము మరియు మా ఆత్మీయ జీవితాలు ఆధారపడి ఉన్నాయి అని అన్నాట్ట. ఇంకేముంది ఆ మాటలు విన్న పాష్టరుగారికి చెమటలు పట్టినంత పనైందట. 'నిజమే! సాతాన్ను చూసి మనం భయపడకపోవడం విశేషం కాదు గానీ, మనల్ని చూసి సాతాను భయపడడం విశేషమే మరి!

సాతాను యేసయ్యను చూసి "యేసూ సర్వోన్నతుడైన దేవుని కుమారుడా నాతో నీకేమి? అంటూ వణకుచూ మోకరిల్లెను. (మార్కు 5:7)  సాతాను పౌలును గురించి "అందుకు ఆ దయ్యము యేసయ్యను గుర్తెరుగుదును. పౌలును కూడా గుర్తెరుగుదును గాని మీరెవరని వారిమీద పడి వారిని లొంగదీసుకొనెను కనుక  వారు దిగంబరులైపోయిరి. (అపో.కా. 19:15,16) అహా! సాతానుకు యేసయ్య తెలుసు, ఆయన శక్తి తెలుసు, అలాగే పౌలు తెలుసు పౌలుకున్న భక్తి తెలుసు. కనుకనే వీరికి సాతాను భయపడ్డాడు. 'దేవునికి స్తోత్రం' మనలను చూచి సాతాను అమ్మో! ఈ సహోదరుడు నాకు తెలుసు, ఈ సహోదరి నాకు తెలుసు వీరు పరిశుద్ధులు ప్రార్థనాపరులు దేవునికితప్ప మరెవరికి భయపడరని సాతాను ఎరిగి మిమ్మును చూసి సాతాను భయపడుతున్నాడా?

- పి. ఎస్కే

## మనకు వచ్చే బాధలు, ఇరుకులు, ఇబ్బందులు మనల్ని ఏమి చేస్తాయంటే..?

| | |
|---|---|
| 1. దేవుని నామానికి మహిమ తెస్తాయి. | (యోహా 19:1-3; 11:3,4; 21:18,19) |
| 2. దేవుని శక్తిని, నమ్మకత్వాన్ని కనబరుస్తాయి. | (కీర్త 34:19,20; 2 కొరిం 4:8-11) |
| 3. దేవుని చిత్తాన్ని బయలుపరుస్తాయి. | (కీర్త 119:71; యెష 26:9; మీకా 6:9) |
| 4. దేవునివైపుకు త్రిప్పుతాయి. | (ద్వితీ 4:30,31; యెష 10:20) |
| 5. మరలా మనం దేవునికి దూరం కాకుండా చేస్తాయి. | (యోబు 34:31,32; యెష 10:20) |
| 6. ప్రార్థన ద్వారా దేవునికి సమీపస్తులుగా చేస్తాయి. | (న్యాయా 4:3; యిర్మి 31:18; విలాప 2:17-19; హోషే 5:14,15; యోనా 2:1) |
| 7. చేసిన తప్పును ఒప్పింపజేస్తాయి. | (యోబు 36:8,9; కీర్త 119:67; లూకా 15:16,18) |
| 8. మనకున్న విశ్వాసాన్ని, నమ్మకత్వాన్ని పరీక్షిస్తాయి. | (యోబు 23:10; కీర్త 66:10; సామె 17:3) |
| 9. మనలో తగ్గింపు, దీనత్వమును పెంపొదిస్తాయి. | (నిర్గ 15:23-25; 1 పేతు 1:7; ఆది 22:1,2; హెబ్రీ 11:17) |
| 10. మనలను పరిశుద్ధ పరుస్తాయి. | (ప్రసం 7:2,3; యెష 1:25,26;48:10; యిర్మి 9:6,7; జెక 13:9;   మలా 3:2,3) |

# 1 సమూయేలు గ్రంథం నుండి

క్విజ్

**ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు మరియు రెఫరెన్స్‌లు వ్రాయవలెను.**

1. యెహోవా కోరుకొన్నవాడు ఎవరు?
2. అతని పాటి సుందరుడొకడును లేడు? ఎవరతడు?
3. మూర్ఖతను అగపరచుట దేనితో సమానము
4. దేవుడు ఘనపరచునది ఎవరిని?
5. ఇశ్రాయేలీయుల పక్షముగా ప్రార్థించినది ఎవరు?
6. ప్రార్థన మానుట పాపము అని చెప్పినది ఎవరు?
7. హృదయము హృదయముతో కలిసిపోయెను?ఎవరివి?
8. ఎవరికిని అన్యాయము చేయలేదు, ఎవరిని బాధ పెట్టలేదు, ఎవరియొద్దను దేనినైనను తీసుకొనని వ్యక్తి ఎవరు?
9. జనులను మృతులుగాను, సజీవులుగాను చేయువాడు ఎవరు?
10. యెహోవా కలిగియున్న ఇష్టము ఏది?
11. యెహోవా జ్ఞాపకము చేసుకొనినది ఎవరిని? వారు పొందుకున్నది ఏమిటి?
12. అతని మాటలలో ఏదియు తప్పిపోలేదు? ఎవరతను?
13. యెహోవాను ఎరుగనివారు ఎవరు?
14. ఇశ్రాయేలీయులకు ఆధారమైనవాడు ఎవరు?
15. హన్నా సముయేలును యెహోవాకు ప్రతిష్ఠించినది ఎప్పుడు?
16. ప్రజలకు క్షేమము కలగాలంటే ఏమి చేయాలి?
17. యెహోవా హస్తము ఎవరిమీద భారముగా ఉండెను?
18. బాలుడు ఎవరు? బాల్యము నుండి యుద్ధాభ్యాసము చేసినవాడు ఎవరు?
19. అతడు ఏ మాటలు చెప్పును ఆ మాట నెరవేరును? అతడు ఎవరు?
20. ఐశ్వర్యము కలుగజేయువాడు ఎవరు?

**గత సంచిక క్విజ్‌కు సరైన సమాధానములు వ్రాసినవారు:**

| | | |
|---|---|---|
| 1. | సహో॥ ఎ.డి. ఆనంద రాజు | జ్యోతి నగర్, కరీంనగర్ |
| 2. | సహోదరి సిహెచ్. జయలక్ష్మీ | కనిగిరి, ప్రకాశం |
| 3. | సహోదరి ప్రేమలత | విజయనగర్ కాలనీ, హైదరాబాద్ |
| 4. | సహో॥ నరేష్ బాబు | ఎలిశెట్టివారిపాలెం, తూ.గోదావరి |
| 5. | సహోదరి బుజ్జి | మంగళగిరి, గుంటూరు |
| 6. | సహో॥ డి. పూర్ణచంద్రరావు | బిహెచ్ఇఎల్, హైదరాబాద్ |
| 7. | సహో॥ జాషువా | మైదుకూరు, కడప |
| 8. | సహోదరి జి. పావని | ఎలిశెట్టివారిపాలెం, తూ.గోదావరి |
| 9. | సహో॥ మోజెస్ | గుంతకల్, అనంతపూర్ |
| 10. | సహోదరి గంగావతి | ఇచ్ఛాపురం, శ్రీకాకుళం |
| 11. | సహోదరి ఎస్. బుజ్జి | నరసరావుపేట, గుంటూరు |
| 12. | పాస్టర్ బి. జోసెఫ్ పాల్ | రంపచోడవరం, తూ.గోదావరి |
| 13. | సహోదరి ఎ. మిన్నీ సుందరి | బిహెచ్‌విపి టౌన్‌షిప్, విశాఖపట్నం |
| 14. | సహో॥ సామ్సన్ రాజు | నర్సాపూర్, ప.గోదావరి |
| 15. | సహోదరి రిబ్కమ్మ | కలసపాడు |
| 16. | శ్రీమతి కమలా కుమారి | క్రిస్టియన్‌పేట, గుంటూరు |
| 17. | సహోదరి గీతా సాగర్ | వెంకటాద్రిపాలెం, నల్గొండ |

**మీ సమాధానాలు మాకు చేరవలసిన చివరి తేది:**

**నవంబర్ 15, 2007**

**క్విజ్ మాస్టర్**

**కల్వరి, పోస్ట్ బాక్స్ 30, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 72.**

**గత సంచిక క్విజ్ సమాధానములు:**

| | | |
|---|---|---|
| 1. | రూతు | రూతు 2:23 |
| 2. | మధురము, చేదు | రూతు 1:20 |
| 3. | బోయజు, రూతును | రూతు 4:10 |
| 4. | నయోమికి, యెహోవా | రూతు 2:12 |
| 5. | నయోమి | రూతు 1:11 |
| 6. | వ్రాయబడింది | మత్తయి 1:5 |
| 7. | రిక్తురాలిగా, తన కోడలితో | రూతు 1:21 |
| 8. | ఓర్పా, రూతు | రూతు 1:8,18 |
| 9. | భర్తను, కుమారులను పోగొట్టుకున్నారు | రూతు 1:5 |
| 10. | ఉదయము, బోయజు పొలంలో | రూతు 2:7,3 |
| 11. | రూతు, ఓర్పా | రూతు 1:14 |
| 12. | బోయజుకు, రూతుకు | రూతు 2:20,3:10 |
| 13. | బోయజు | రూతు 2:1 |
| 14. | తన (నయోమి) జనులను, ఆహారమిచ్చుటకు | రూతు 1:6 |
| 15. | రూతు | రూతు 1:16 |
| 16. | ఎలీమెలెకు | రూతు 1:1,3,4 |
| 17. | బోయజు | రూతు 2:20 |
| 18. | రూతు, ఓర్పా | రూతు 2:11; 1:5 |
| 19. | బోయజు, చేను కోయువారు | రూతు 2:4 |
| 20. | ఓబేదు | రూతు 4:17 |

# తాగేవారికి ఈ విష(య)ం తెలుసా?

**మీరు బాగా త్రాగుతారా? అయితే ఈ విషయం గురించి తెలుసుకోండి.**

మీ నోటి నిండా విస్కీ పోసుకొని కనీసం 5 నిమిషాలు ఉంచండి. మీ నోరు మొత్తం ఎర్రబారి నోరు పచ్చి పుళ్ళు పడడం జరుగుతుంది. ఆ తరువాత 10 నుండి 15 నిమిషాలు అలానే నోట్లో విస్కీని ఉంచండి. నోరంతా పొక్కిపోతుంది. ఇప్పుడు మీ కళ్ళకు గంతలు కట్టి మీ నోట్లో నీళ్ళుగాని, పాలుగాని, వెనిగర్‌గాని పోయమనండి. విచిత్ర మేమంటే మీ నోటిద్వారా పాలు త్రాగుతున్నారో, నీళ్ళు త్రాగుతున్నారో, వెనిగర్ త్రాగుతున్నారో కూడా గుర్తు పట్టలేరట. కొంచెం నోట్లో పోసుకుంటేనే అది 5 నిమిషాలు నోట్లో ఉంటేనే నోరు అంత పాడైపోతే , ఆ మందు కాస్త లోపల చేరి గుండెను, ఊపిరితిత్తులను ఎంత పాడు చేస్తుందో గ్రహించారా?

25వేల రూపాయల ఖరీదు చేసే స్కూటర్‌లో ఎవరైనా కిరోసిన్‌గాని, డీజిల్‌గాని, యాసిడ్‌గాని పోయరు. ఒకవేళ ఎవరైనా అలాచేస్తే వీడికి పిచ్చి పట్టిందని అంటారు. అయితే మూడుకోట్ల రూపాయల ఖరీదు చేసే రసాయనాలు కలిగిన మనిషి శరీరం (ఏ సైంటిస్టయినా ఒక మనిషి శరీరంలో ఉన్న రసాయనాలను తయారు చేయాలని పూనుకుంటే, అతనికి మూడు కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని వెల్లడయింది) ఇంత విలువైన శరీరంలో బ్రాంది, విస్కీ, సారాయి పోస్తే పాడైపోతుందని తెలిసి కూడా తాగేవారిని ఏమంటారు? తెలివైన వారైతే స్కూటర్‌లో కిరోసిన్ పోయరు. అలాగే శరీరంలో మద్యం (స్లో పాయిజన్) పోయరు. మరి మీరెవరు???

: పి. ఎస్కే

# దేవుడు కనబడటం లేదు

**(నవ్వుకోండి)**

ఒక దంపతులకు 8 సం॥ల, 10 సం॥ల కుమారులు కలరు. వారు బహు అల్లరి పిల్లలు. ఎంత అల్లరి వాళ్ళంటే ఆ ఊరిలో ఏ గొడవ జరిగి, ఏ దొంగతనం జరిగినా సాధారణంగా ఈ ఇద్దరే కారకులన్నంతగా. దగ్గర్లో ఉన్న ఓ పాస్టరుగారు ఎటువంటి అల్లరి పిల్లలనైనా దారిలో పెడతారని విని, ఆ ఇద్దరు పిల్లలతో మాట్లాడుమని ఆ తల్లి వెళ్ళి ప్రాధేయపడగా సరే అని ఆయన ఒప్పుకొనెను.

మొదటిగా ఆ తల్లి 8 సం॥ల కొడుకుని ఆయన దగ్గరకు పంపెనట. ఆయన చాలా లావుగా, ఎత్తుగా ఉండేసరికి ఈ కుర్రాడికి ఆయన్ని చూడగానే చెమటలు పట్టడం మొదలైంది. ఆ పాస్టరుగారు ఆ చిన్నోడి కళ్ళలో కళ్ళుపెట్టి చూచి 'దేవుడు ఎక్కడున్నాడు' అని గట్టిగా అడిగెనట. అంతే! ఆ చిన్నోడు బిగుసుకుపోయి నోటిమాట రాలేదట. మరలా పాస్టరుగారు చెప్పు 'దేవుడు ఎక్కడున్నాడు' అని అనగా భయపడిపోయిన ఆ చిన్నోడు ఒక్కసారి లేచి అక్కడనుండి బయటకు పారిపోతుండగా 10 సం॥ల అన్న ఎదురు వచ్చెనట. వాడిని చూసి ఓరేయ్! మనం గొప్ప ఇరుకులో పడ్డాం. ఏమైందిరా అని పెద్దోడు అడగ్గా... ఓరేయ్! దేవుడు కనబడటం లేదట. దానికి కారణం మనమే అని అందరికీ అనుమానం వచ్చేసింది. నన్ను చూసి పాస్టరుగారు 'దేవుడెక్కడున్నాడని' ఒకటే అడుగుతున్నాడు!!!






# లోతు లేని లోతు !

**ఎవరీ లోతు ?** తెరహు అబ్రహామును, నాహోరును, హారానును కనెను. హారాను లోతును కనెను. అంటే లోతునకు అబ్రహాము పెద్దనాన్న అవుతాడన్న మాట.

**ఏ ఊరువాడు?** 'ఊరు' అను ఊరువాడు (అంటే ఆ గ్రామంపేరు 'ఊరు')

**లోతునకు లోతైన చరిత్ర ఉందా?** అంటే లేదనే చెప్పాలి, కాని నేటి నామకార్థ క్రైస్తవులకు ఆత్మీయ జీవితంలో దిగజారిపోయిన వారికి లోతు చరిత్ర గొప్ప హెచ్చరిక.

**1. విడి-పడి పోయిన లోతు (ఆది 13:5-7)** అబ్రహాము దేవునిచే బహుగా దీవించబడ్డాడు. అబ్రహాము గిన్నె నిండిపొర్లి తనతో వస్తున్న లోతు గిన్నె కూడ నింపింది. ఇద్దరు బహు ధనవంతులైరి అని బైబిల్ చెబుతుంది. ఆ ధనమే వారిని విడదీసినట్టుగా కనిపించినా వాస్తవం మాత్రం లోతు జీవితం స్వార్థంతో కూడినట్లు చూస్తాం. అబ్రహాము విశ్వాసము ద్వారా దేవునిమీద ఆధారపడి ముందుకు సాగుతుంటే లోతు మాత్రం తన ఆస్తిని తన కన్నులను నమ్ముకొని ముందుకు సాగుతున్నట్టు మనం చూస్తాం. అబ్రహాము పనివారికి లోతు పనివారికి గొడవ వచ్చింది. అప్పుడు లోతు యొద్దకు అబ్రహాము వచ్చి మనం గొడవ పడడం సబబు కాదు. నీవు ఎటు వెళ్తావో నిర్ణయించుకోమని సలహా ఇచ్చెను. నిన్ను విడచి నేను ఎక్కడికి వెళ్తాను. నేను ఈ రోజు ఏమై యున్నానో అది నీ వల్లే కదా! నిన్ను విడచి నేను నాశనం కాలేను అని అంటే నమ్మకస్తుల జాబితాలోనికి వచ్చేవాడు, కాని ఎప్పుడు అదును దొరుకుతుందా ఎప్పుడు విడిపోదామా అన్నట్టు గోడమీద పిల్లిలా ఉన్న లోతునకు ఈ వార్త మహా ఆనందాన్ని కల్గించి యుండొచ్చు. మారుమాట పలుకకుండా తన దారి తాను చూసుకొనెను. ఈ రోజుల్లో కూడ అనేకమంది సేవకులవద్ద నమ్మకముగా కొంతకాలం ఉంటూ కాస్త బైబిల్ జ్ఞానం వంటబడితే, కొద్దిగా ప్రసంగం చేయటం చేతనైతే వెంటనే వేరే కుంపటి పెట్టడం మరియు విడి-పడి పోవడం మనం చూస్తూనే ఉన్నాం. వీరును లోతు సోదరులే.

**2. దీనత్వంలో లోతు లేని లోతు:** "చిన్న పిల్లలారా మీరు పెద్దలకు లోబడి యుండుడని" (పేతురు 5:5)లో చూస్తాం. లోతు దీనుడై లోబడే తత్వము కలవాడైతే అబ్రహాముతో "అయ్యా! నువ్వు దేవునితో నడచువాడివి, పైగా నా కంటే పెద్దవాడివి నువ్వే చెప్పు నన్ను ఎక్కడికి వెళ్ళమంటావో నీ మాటకు పూర్తిగా లోబడతాను అని అంటే లోతు వాక్యానుసారుడు అనుకోవచ్చు. కాని అందుకు విరుద్ధముగా ప్రవర్తించెను. అబ్రహాము మంచి మనస్సు కలవాడు గనుక వారి మధ్య బేధాభిప్రాయాలు రాకూడదని లోతునకు తీర్మానం తీసుకొనే అవకాశం ఇచ్చెను. "నాశనానికి ముందు గర్వం నడుచును." (సామె 16:18) అని బైబిల్ అన్నట్లు లోతు తన గర్వముతో నాశనకరమైన తీర్మానం తీసుకొనెను.

**3. ఆత్మీయతలో లోతు లేని లోతు:** ఆకాశంవైపు కన్నులెత్తి నన్ను ఎటు వెళ్ళమంటావో తెలియజేయి ప్రభువా! అని అంటే బాగుండు. లేదా తన ఆత్మీయ తండ్రైన అబ్రహామును సలహా అడిగిన బావుండు. కాని తనకు ప్రసుత్తం ఆత్మీయ నేత్రాలు మూసుకొని పోయినాయి. కనుకనే కనీసం దేవుడు కూడా జ్ఞాపకము రాలేదు. చివరికి తన కన్నులను నమ్ముకొనెను. "ఒకని యెదుట యథార్థముగా కనబడు మార్గము కలదు కాని అది తుదకు మరణమునకు దారి తీయును (సామె 14:12) అనే విషయము పూర్తిగా మరచిపోయెను. కనుకనే నాశనమునకు అగ్ని గంధకములకు సిద్ధమౌతున్న సొదొమ తనకు దేవుని తోట వలెను, ఐగుప్తు దేశము వలెను కనిపించెను. దేవుడు సొదొమను చూచి బహు ఘోరమైన పట్టణమని అంటూంటే (ఆది 18:20) లోతు ఆ సొదొమను చూచి యెహోవా తోటలా ఉంది అని భ్రమపడడం ఆత్మీయతలో లోతు లేకపోవడమే కదా!

**4. ఆలోచనల్లో లోతు లేని లోతు:** మొదట లోతు సొదొమను చూచెను. తర్వాత సొదొమ వైపు నడచి అక్కడే కాపురముండెను. మరోవైపు అబ్రహాము దేవునికి దగ్గరగా చేరువౌతుంటే ఇక్కడ లోతు దేవునికి దూరమై లోకానికి,

నాశనానికి దగ్గర పడడం దురదృష్టకరం. "ఈ లోకస్నేహము దేవునితో వైరమని మీరెరుగరా?" (యాకో 4:4) కాని అటువైపు అబ్రహాము దేవుని స్నేహితుడిగా మారడం గొప్ప విషయం. (యాకో 2:23) ఇరువురు ఆత్మీయులే, ఒకే మార్గములో ప్రయాణం మొదలు పెట్టినప్పటికి వారి గమ్యాల్లో ఎంత వ్యత్యాసం! లోతు సొదొమను మాత్రమే పొందుకొనెను. కాని అబ్రహాము సదాకాలము ఆ దేశమంతటిని పొందుకొనెను. (ఆది 13:14,15)

**5. శత్రువు వచ్చినపుడు తప్పించుకోలేని లోతు:** సొదొమ చాలా బాగుంటుందని, నీళ్ళుపారు దేశమని, సురక్షితమైన ప్రదేశమని తన తెలివిని నమ్మి అక్కడికి వచ్చెను గాని తాను ప్రమాదాలకు, దోచుకొనే వారికి, నాశనమునకు చేరువైతినని చాలా ఆలస్యంగా గ్రహించెను. శత్రువు వచ్చితనను తన కుటుంబాన్ని, ఆస్తిని కొళ్ళగొట్టుచున్నపుడు తనను తాను రక్షించుకోలేని దీన స్థితికి దిగజారిపోయెను. కాని అబ్రహాము బంధించబడిన తన సహోదరుణ్ణి రక్షించి మరలా బ్రతుకు ప్రసాదించెను. (ఆది 14:10-16) ఇంత జరిగిన తర్వాత లోతునకు బుద్ధి వచ్చిందంటారా? లేదు సుమా! మరలా సొదొమలోనే కాపురం పెట్టాడు. (ఆది 19:1)

**ఫలితం:** అబ్రహాము విజ్ఞాపన వలన అగ్నిలోనుండి రక్షింపబడినట్లు రక్షింపబడెను. (ఒకని పని కాల్చి వేయబడిన యెడల వానికి నష్టము కలుగును. అతడు తను మట్టుకు రక్షింపబడును గాని అగ్నిలో నుండి తప్పించుకొన్నటు రక్షింపబడును" (1కొరి 3:14,15) తాను సంపాదించిన ఆస్తి అంతా బూడిదైపోయెను. తన భార్య ఉప్పు స్తంభమై మిగిలెను. తాను నమ్ముకున్న తన కళ్లు తననే పొడిచెను. ఆఖరికి తన కుమార్తెలు తనతో పాపముచేసి శాపగ్రస్తమైన జనాంగమును కనెను. అయ్యో! లోతులేని లోతు ఎంతగా దిగజారిపోయెను? ఇదంతా ఎక్కడ ప్రారంభమాయెను. తాను దేవుని ఆశ్రయించక దేవుని సంప్రదించక తన కళ్ళను నమ్మి ఆరోజు తాను తీసుకున్న ఓ తప్పు తీర్మానం ఈరోజు తనను దిక్కుమాలిన వానిగా చేసెను.

**ప్రియ స్నేహితుడా!** లోతు, అబ్రహాము ఒకే దేవుణ్ణి సేవించిన వారైనప్పటికీ, ఒకే దారిలో ప్రయాణం మొదలు పెట్టినప్పటికీ వారి గ్యమము, వారి అంతములో ఎంత వ్యత్యాసము. "కార్యారంభముకన్న కార్యాంతము మేలు" కదా. అబ్రహాము విశ్వాసులందరికి తండ్రి అయితే, లోతు శాపగ్రస్థులకు తండ్రి కావడం ఎంత దౌర్భాగ్యం. చివరిగా మన కళ్ళను తెలివి తేటలను ఆధారం చేసుకొని మోసపోక, నాశనం కాక, దేవునిపై ఆధారపడి బహు జాగ్రత్తగా ముందుకు సాగుదాం! లోతు లేని లోతు వలె కాక ఆదర్శమైన అబ్రహామును మన తండ్రిని అనుసరిద్దాం! **- పి. ఎస్కే**

## దయచేసి గమనించండి!

- మీకేమైనా ప్రార్ధనా అవసరతలున్నట్లయితే ఈ నెంబర్‌కి ఫోన్ చేయండి: 9348958575. మీ గురించి, మీ ప్రార్ధనా విన్నపములన్నింటి కొరకు ప్రార్ధనా గోపురము నందు తప్పక ప్రార్ధించెదరు.
- మీరు యం.ఓ.లు పంపునపుడు ఆ రుసుము దేనికొరకు పంపుచున్నారో (పత్రిక కొరకా? టీవీ పరిచర్య కొరకా? సిడిలు/క్యాసెట్లు) వర్తమానములు/పాటల విసిడిలు అయినట్లయితే వర్తమానముల పేరు/ పేరు తెలియనిచో టీవీలో ప్రసారము చేయబడిన తేదీని) తెలియజేస్తూ యం.ఓ. ఫారంపై మీ పూర్తి చిరునామాతోపాటు ఫోన్ నంబర్ తప్పనిసరిగా రాసి పంపించండి!
- మీరు చెక్కులు లేదా డి.డి.లు పంపినట్లయితే **(Calvary Mission)** అనే పేరుతో పంపించ మనవి.
- మీరు యం.ఓ. ఫారం మీద మీ చిరునామా వ్రాయునప్పుడు క్యాపిటల్ లెటర్స్‌లో వీలైనంత వరకు ఇంగ్లీషులో వ్రాయడానికి ప్రయత్నించండి. ఒకవేళ మీకు రెండు పత్రికలు వస్తున్నట్లయితే దయచేసి ఆ రెండు పత్రికల కవరుపైనున్న లేబుల్ మీద ఉండే కోడ్ నెంబర్ ఉదా: **(30155)** మరియు అడ్రస్ తప్పక రాసి పంపించండి. మరియు మీ అడ్రస్‌లో ఏదైనా మార్పు ఉన్నట్లయితే పాత, కొత్త అడ్రసులను దయచేసి వెంటనే ఒక పోస్టుకార్డు లేదా ఒక ఫోన్ కాల్ ద్వారాగానీ మాకు తెలియజేయండి.

# ప్రార్థనా శక్తి

1. **అబ్రాహాము** : ప్రార్థించగా, లోతు కుటుంబ సమేతంగా సొదొమ, గొమొఱ్ఱా పట్టణవాసులతో కూడా కాలిపోకుండా కాపాడబడ్డాడు. (ఆది 18:22-33)
2. **ఎలీయెజెరు** : ప్రార్థించగా, రిబ్కా కనిపించింది. (ఆది 24వ అధ్యాయం)
3. **యాకోబు** : రాత్రంతా దేవునితో ప్రార్థనలో పెనుగులాడితే, ఏశావుతో 20 ఏండ్లుగా ఉన్న శత్రుత్వం సమసిపోయింది. (ఆది 32వ అధ్యాయం)
4. **మోషే** : ప్రార్థించగా, అమాలేకీయుల మీద విజయం సిద్ధించింది. (నిర్గ 17:8-16)
5. **యెహోషువ** : ప్రార్థించగా, సూర్యచంద్రులు నిలిచాయి. శత్రువులు హతం చేయబడ్డారు.
6. **యెహోషువ** : ప్రార్థించగా, పాపం చేసిన ఆకాను బయటపడ్డాడు. (యెహో 7వ అధ్యాయం)
7. **హన్నా** : ప్రార్థించగా, దేవుడు ఆమెకు ఒక కుమారుని (సమూయేలు) ప్రసాదించాడు. అతడు ఇశ్రాయేలు జనాంగమును దేవునితో సమాధాన పరిచాడు. (1సమూ 1:9-28)
8. **దావీదు** : ప్రార్థనకు ఫలితంగా అహీతోపెలు దురాలోచన చెడగొట్టబడెను. (2సమూ 15:31;17:1-23)
9. **ఆసా** : ప్రార్థించినపుడు తనపై దండెత్తి వచ్చిన 10 లక్షల మంది కూషీయులను జయించెను. (2దిన 14:9-15)
10. **ఏలీయా** : ప్రార్థించగా, మూడున్నర సంవత్సరములు వర్షము కురియలేదు. తిరిగి ప్రార్థించగా వర్షము కురిసింది. (యాకో 5:17,18)
11. **ఏలీయా** : ప్రార్థించగా, దేవుడు ఆకాశము నుండి అగ్నిని పంపి, బల్యర్పణను దహించి అంగీకరించాడు. (1రాజు 18:17-39)
12. **ఎలీషా** : ప్రార్థించగా, అతనికి ఏలీయా దుప్పటి, రెండంతల ఆత్మ లభించింది. (2రాజు 2:9-15)
13. **ఎలీషా** : ప్రార్థించగా, చనిపోయిన పిల్లవాడు బ్రతికాడు. (2రాజు 4:17-37)
14. **యెషయా, హిజ్కియా** : ప్రార్థించగా, 12 గంటలలో లక్షా 85వేల మంది అష్షూరీయులు హతమయ్యారు. (2రాజు 19వ అధ్యాయం)
15. **ఎజ్రా** : ప్రార్థించగా, ఉజ్జీవము కలిగినది. (ఎజ్రా 10వ అధ్యాయము)
16. **నెహెమ్యా** : ప్రార్థనకు ఫలితంగా రాజు గుండె మెత్తబడినది. (నెహె 1,2 అధ్యాయాలు)
17. **ఎస్తేరు, మొర్దెకై** : ప్రార్థించగా, యూదులను నాశనం చేయాలని హామాను చేసిన కుట్ర విఫలమై హామాను తయారు చేయించిన ఉరి కొయ్యకు అతనే ఉరి తీయబడ్డాడు. (ఎస్తే 3-7 అధ్యాయములు)
18. **దానియేలు** : ప్రార్థించగా, నిగూఢ విషయాలు వెల్లడి చేయబడ్డాయి. (దాని 2:17-19)
19. **దానియేలు** : ప్రార్థించగా, సింహాలు నోరు మూసాయి. (దాని 6వ అధ్యాయం)
20. **షద్రకు,మేషాకు,అబెద్నెగో** : ప్రార్థించగా, అగ్ని జ్వాలల్లో పడవేయబడినప్పటికీ సురక్షితంగా విహరించారు. ప్రభువు వారితో కూడా సంచరించాడు. (దాని 3వ అధ్యాయం)
21. **యోనా** : ప్రార్థించగా, సముద్ర గర్భంలో మ్రింగివేసిన మత్స్యపు కడుపులో నుండి రక్షించబడ్డాడు. (యోనా 2:1-10)
22. **పేతురు** : ప్రార్థించగా, దొర్కా చనిపోయినను తిరిగి బ్రతికింది. (అపో.కా. 9:10)
23. **సిలువపై దొంగ** : ప్రార్థించగా, యేసు ప్రభువుతో కూడా పరదైసు ప్రవేశం పొందాడు. (లూకా 23:42,43)
24. **సంఘము** : అత్యాసక్తితో ప్రార్థించినపుడు, పేతురు చెరసాల నుండి ఆశ్చర్యముగా విడిపించబడ్డాడు. (అపో.కా. 12:5-10)
25. **శిష్యులు** : ప్రార్థించగా, పరిశుద్ధాత్మ పూర్ణులైనారు. వేలాది ఆత్మలను రక్షణలోనికి నడిపించగలిగారు. (అపో.కా. 2వ అధ్యాయం)

'నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును." (యాకో 5:16) విశ్వాసులు విశ్వాసంతో, పట్టువదలక ప్రార్థిస్తే; ప్రపంచమంతా ఉజ్జీవ జ్వాలలు అలుముకొని అసంఖ్యాకమైన ఆత్మలు రక్షింపబడవా? గనుక ప్రార్థించుదాము రండి!

**డా॥ ఎన్. జయపాల్**

# యేసయ్య బిజీగా వుండి...



ఆ తండ్రి దేవునియందు భయభక్తులు కలవాడు. కనుక తన కుటుంబాన్ని వాక్యానుసారముగా కట్టుకొనుచుండెను. ఓరోజు కుమారుడితో భోజనమునకు కూర్చుండి, దేవునికి వందనాలు చెల్లిద్దాం కళ్ళు మూసుకో అనిచెప్పి తండ్రీ! మా మధ్యకు అతిధిగా రండి, మాతో కలిసి భోజనం చేయండి. ఈ ఆహారాన్ని మాకు అనుగ్రహించినందుకు, దీవించినందుకు వందనాలు అనిచెప్పి ప్రార్ధన ముగించెను. అప్పుడు ఆ చిన్న కుమారుడు డాడీ! ప్రతిరోజు యేసయ్యా! మా మధ్యకు అతిధిగా రండి అని ప్రార్ధిస్తారు కాని ఆయన ఎప్పుడూ రాలేదెందుకని ప్రశ్నించెను.

ఆ తండ్రి నాయనా! మనము రమ్మంటే తప్పక యేసయ్య వస్తాడు. అని అంటుండగా... అయితే డాడీ! మరి యేసయ్యకు కూడా డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీ వేద్దాం ఆయన కూర్చుంటాడు అని యేసయ్యకోసం కుర్చీ వేసాడట. ఇంతలో ఓ పేద కుర్రాడు ఆకలితో అలమటించిపోతూ దీనంగా తలుపు దగ్గర నిలబడి బిక్షం అడిగాడట. అది చూచిన ఆ చిన్నబాబు... డాడీ! బహుశా యేసయ్య కాస్త బిజీగా వుండి ఈ కుర్రాడ్ని పంపించాడేమో అని అంటూ... ఆ పేద కుర్రాడి దగ్గరకు వెళ్ళి ఎంతో ఆప్యాయతతో చేయి పట్టుకొని రా! నీకోసం కుర్చీ ఖాళీగా ఉంది. తీసుకొచ్చి భోజనం వడ్డించాడట. అది చూస్తున్న తండ్రి కళ్ళలో కన్నీళ్ళు జలజలా రాలెనట.

ప్రియ చదువరీ! అవసరతలో, పేదరికంలో, కష్టంలో ఉన్న ప్రతి వ్యక్తిలో మనం ఆ చిన్నబాబు వలె క్రీస్తును చూడగలిగితే ఎంత ధన్యులం. ఈరోజు ఎవరిలోనైనా క్రీస్తును చూసే ప్రయత్నం ఎందుకు చేయకూడదు?
"అందుకు నీతిమంతులు ప్రభువా! యెప్పుడు ఆకలిగొని యుండుట చూచి నీకాహారమిచ్చితిమి? నీవు దప్పిగొని యుండుట చూచి యెప్పుడు దాహమిచ్చితిమి? యెప్పుడు పరదేశివై యుండుట చూచి నిన్ను చేర్చుకొంటిమి? దిగంబరివై యుండుట చూచి బట్టలిచ్చితిమి? అందుకు రాజు - మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను." (మత్త 25:37-40)

పి. ఎస్కే

# ఇంతకీ నేనెవరో తెలుసా..?



1. నేను కృశించియున్నాను. (కీర్త 6:2)
2. నేను మూలుగుచు అలసియున్నాను. (కీర్త 6:6)
3. నేను ఏకాకిని, బాధపడువాడను. (కీర్త 25:16)
4. నేను నరుడను కాను, పురుగును. (కీర్త 22:6)
5. నేను ఇరుకున పడియున్నాను. (కీర్త 31:9; 38:6; 39:17)
6. నేను శ్రమచేత మిక్కిలి కృంగియున్నాను. (కీర్త 38:6)
7. నేను సొమ్మసిల్లి బహుగా నలిగియున్నాను. (కీర్త 38:8)
8. నేను క్షీణించుచున్నాను. (కీర్త 39:10)
9. నేను శ్రమల పాలై దీనుడనైతిని. (కీర్త 40:17)
10. నేను బహు కృంగి యున్నాను. (కీర్త 69:20)
11. నేను బాధపడినవాడనై వ్యాకులపడుచున్నాను. (కీర్త 69:29)
12. నేను దీనుడను, దరిద్రుడను (కీర్త 86:1)
13. నేను దీన దరిద్రుడను. (కీర్త 109:22)

నేను రాజునైనప్పటికీ, యెహోవా హృదయానుసారుడనైనప్పటికీ, దేవుని ధర్మశాస్త్రము దివారాత్రులు ధ్యానించినప్పటికీ, కీర్తనలు వ్రాసినప్పటికీ నాకు కూడా ఈ శ్రమలు, ఈ ఇబ్బందులు, ఇరుకులు, శోధనలు, అవమానాలు, నిందలు తప్పలేదు. ఇన్ని అనుభవించిన నేను శ్రమల్లో ఉన్న నీకు ఇచ్చే సలహా ఏమిటంటే "శ్రమనొంది యుండుట నాకు మేలాయెను."(కీర్త 119:71)

# పౌలుగారి సాక్ష్యం...



**1. పౌలు మార్పుచెందిన వ్యక్తి :** ఇంతకు ముందు ప్రభువైన యేసుకు వ్యతిరేకంగా జీవించాడు. సంఘాన్ని హింసించాడు. కాని యేసయ్య దర్శించినప్పుడు అద్భుతముగా మారి క్రీస్తు ఖైదీగా తన్నుతాను అప్పగించుకొన్నాడు. పౌలు జీవితంలో పాత రోత జీవితం సమాధి చేయబడి నూతన జీవితము అనుగ్రహింపబడినది. అవును! “ఎవడైనను యేసుక్రీస్తు నందున్నయెడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను, ఇదిగో సమస్తము క్రొత్తవాయెను.” (2 కొరిం 5:17) అని బైబిల్ సెలవిస్తుంది. ప్రతి క్రైస్తవునికి ఈ అనుభవం ఉండాలి. పాత జీవితం సమాధి చేయబడి, నూతన బ్రతుకు ప్రారంభమైన దినము, సందర్భము తప్పక ఉండాలి. అది పౌలు జీవితంలో స్పష్టంగా కనిపించింది. మరి నీ జీవితంలో?

**2. పిలువబడినవాడు :** పౌలు సంఘాన్ని హింసిస్తూ, క్రైస్తవులను చెదరగొడుతూ తను చేస్తుంది ఏదో ఘన కార్యమని తలంచినపుడు సాక్షాత్తు ప్రభువే ప్రత్యక్షమై సౌలా! సౌలా! అని పేరుపెట్టి పిలిచి తన సాక్షిగా, సేవకుడిగా ఎన్నుకొన్నాడు. పిలుచుకొన్నాడు. ఆరోజు నుండి తాను కన్నుమూసేంత వరకు పౌలు ఎన్నడూ వెనక్కి తిరిగి చూడలేదు. విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించు క్రీస్తువైపుకు చూస్తూ మంచి పోరాటం పోరాడుచూ విశ్వాసం కాపాడుకొన్నాడు. తన పరుగును కడముట్టించాడు. (హెబ్రీ 12:1,2; 2తిమో 4:7)
సేవ చేయాలని ఆశగొని యున్నాడు. దేవుని సేవ నువ్వు చేయాలని ఆశగొని యుంటే ఆయన పిలుపు, ఆయన ఇచ్చే దర్శనం కలిగి వుండాలి. దేవుని పిలుపు, ప్రణాళిక లేకుండా చేసేది సేవ కానేకాదు. మరి నువ్వు పిలుపు కలిగిన సేవకుడివేనా? లేక నీ సేవకు వేరే కారణాలు వున్నాయా? పరీక్షించుకో!

**3. పిలుపునకు విధేయతగల సేవకుడు :** “ఆకాశమునుండి కలిగిన ఆ దర్శనమునకు నేను అవిధేయుడను కాక, మొదట దమస్కులోను, యెరూషలేములోను యూదయ దేశమంతటను తరువాత అన్యజనులకు వారు మారుమనస్సు పొంది దేవునితట్టు తిరిగి మారుమనస్సునకు తగిన క్రియలు చేయవలెనని ప్రకటించుచుంటిని. (అపో.కా. 26:19,20)
దేవుడు ఏ పిలుపుతో, ఏ దర్శనముతో సేవకు పిలిచెనో, ఆ పిలుపును, దర్శనమును విడిచిపెట్టకుండా కడవరకు ఆ పిలుపునకు తగినట్లు జీవించడమే పౌలు విజయ రహస్యము. లాభము కొరకు దేవుని పిలుపును తాకట్టు పెట్టేవారు డబ్బు కొరకు, ఫారిన్ ఫండ్ కొరకు దేవుడు అనుగ్రహించిన సువార్త ప్రకటించే పనిని, దర్శనమును ప్రక్కనబెట్టి ఏవేవో చేసి సేవ అనే ఓడ బ్రద్ధలై పాప సముద్రంలో కొట్టుకొనిపోయిన వారిని చూస్తూనే ఉన్నాము.
ప్రియ సేవకా! నీ పిలుపును, దర్శనమును సైతాను చూపించే ప్రలోభాలకు, లాభాలకు అమ్ముకోక నిన్ను నమ్మి శ్రేష్టమైన దర్శనమును అనుగ్రహించి క్రీస్తును నమ్ముకొని నీ తీర్మానము కడముట్టించుము.

**4. దేవునిచేత సహాయం పొందినవాడు :** “అయినను నేను దేవునిచేత సహాయము పొంది నేటి వరకు నిలిచి యుంటిని.” (అపో.కా. 26:22) మన పరిచర్య మన సంఘము, మన ప్రయాస ఫలభరితం కావాలంటే మనుష్యుల వైపుకు చూడకు. వారి సహాయం కొరకు ప్రాకులాడక నిన్ను పిలిచిన దేవుడు నమ్మదగినవాడు కనుక ఆపత్కాలమున నిన్ను పట్టించుకొని సహాయం చేయువాడు గనుక ఆయనమీద ఆధారపడి, ఆయన సహాయం కొరకు మనం ప్రాకులాడినయెడల ఆయన తప్పక సహాయం చేస్తాడు. నీ సేవలో వున్న ప్రతి అవసరాన్ని తీర్చి కడవరకు నిన్ను నిలువబెట్టి పౌలును ఏరీతిగా బలపరచి తన నామ మహిమార్థమై అనేక ఆత్మల రక్షణార్థమై వాడుకొనెనో అలానే నిన్ను వాడుకొనును అనే సత్యము మరువవద్దు.

**5. ఆత్మలపట్ల భారం కలవాడు :** “నాకు బహు దుఃఖమును, నా హృదయములో మానని వేదనయు కలదు. క్రీస్తునందు నిజమే పలుకుచున్నాను. అబద్ధమాడుట లేదు. సాధ్యమైనయెడల దేహసంబంధమైన **(మిగతా 19వ పేజీలో)**

# విజయానికి పది సూత్రాలు




## విజయం అంటే..?

1. కోరికలు గుబ్బాలైన డబ్బును వృధా చేయకుండా వుండగలగడం
2. అన్యాయాన్ని ఓపికతో సహించడం
3. చేతపట్టిన పనిని అయ్యేంత వరకు విడిచిపెట్టకుండా ఉండగలగడము
4. ఎవరూ చూడకపోయినా, మెప్పు పొందకపోయినా నీ బాధ్యత నిర్వర్తించడం
5. విమర్శించబడినప్పటికీ కృంగిపోకుండా నవ్వుతూ స్వీకరించడం
6. పడకపోవడం విజయం కాదుగానీ, పడిన ప్రతిసారి వెంటనే లేచి ముందుకు సాగడం
7. నిందించబడియు నిందించక, ద్వేషించబడియు దూషించకపోవడం
8. క్షమించడం కష్టమైనప్పటికీ మనస్ఫూర్తిగా క్షమించి మరచిపోవడం
9. ఎన్ని కష్టాలు నష్టాలు ఎదురైనప్పటికీ అనుకున్నది సాధించగలగడం.
10. దేవునితో సహవాసం, మనుష్యులతో సమాధానం, ముఖంలో చిరునవ్వు ఎప్పుడూ కలిగియుండడం.

| జయించేవాడు | జయించలేనివాడు |
|---|---|
| 1. ఎక్కడుందో కనుగొందాం అంటాడు | 1. ఎక్కడుందో ఎవ్వరికి తెలియదంటాడు |
| 2. తప్పుచేస్తే 'నేనే' దానికి కారణం అంటాడు | 2. అది నా తప్పు కాదు అంటాడు |
| 3. సమస్యగుండా వెళ్ళి జయిస్తాడు. | 3. దానిని తప్పించుకొని తిరుగుతాడు. |
| 4. చేస్తానంటాడు, చేసి చూపిస్తాడు. | 4. చేస్తానంటాడు కానీ చేయలేడు |
| 5. నేను మంచివాడ్నే కానీ ఉండవలసినంత మంచిగా ఉండలేకపోతున్నా | 5. నేను చెడ్డోడ్ని కాదు, వారికన్న మంచోడ్ని |
| 6. తనకంటే ఉన్నతమైనవారి దగ్గరనుండి నేర్చుకొంటాడు. | 6. వారిని చూసి నేర్చుకోడం చేతకాక వారిని విమర్శిస్తూ వుంటాడు |
| 7. దానిని అంతకన్నా బాగా చేయొచ్చు | 7. ఇప్పటివరకు దానిని అంతా అలాగే చేశారు. |

**(18వ పేజీ తరువాయి...)** నా సహోదరుల కొరకు నేను క్రీస్తునుండి వేరై శాపగ్రస్తుడనై యుండగోరుచున్నాను. (రోమా 9:1-3) 8వ అధ్యాయం (31-39)లో క్రీస్తును చూచి సంతోషించాడు. 9వ అధ్యాయంలో నశించిపోతున్న తన సహోదరులను చూసి బహుగా దుఃఖిస్తున్నాడు. ఎంతగా వేదన చెందుతున్నాడంటే వారు రక్షించబడితే చాలు. అవసరమైతే అందుకొరకు నేను నరకానికి వెళ్తాను. ఇది ఆత్మలపట్ల పౌలు కలిగియున్న భారం.

ప్రియ సేవకా! ఎంతకాలం అయ్యింది నశించిపోతున్న ఆత్మల కొరకు కన్నీరు కార్చి? క్రీస్తు పేరు తెలియక, సువార్త అందక నశించిపోతున్న ఆత్మలు కోట్ల కొలదిగా ఉండగా నిర్లక్ష్యముగా జీవించుటకు, సమయాన్ని వృధా చేసుకొనుటకు, యాజకీయానికి బదులు సంఘ రాజకీయంలో తల మునకలగుటకు ఇది సమయమా? పౌలు రేయింబగళ్ళు ఈలోక మాలిన్యం అంటకుండా ఆత్మల రక్షణార్థమై ప్రాణం పోగొట్టుకొనేంతగా తన్నుతాను అప్పగించుకొన్నాడు. త్వరలో యేసయ్య రాబోవుచుండగా ప్రయాసపడే వారిలో ఆత్మలు సంపాదించే వారిలో ఒకడిగా వుండి భళా! నమ్మకమైన మంచి దాసుడా! అని అనిపించుకొంటారా? లేక సోమరివైన చెడ్డదాసుడా! అని తిట్టిచ్చుకొంటారో నీ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

పౌలులా మారి పౌలు దర్శనం పొంది పౌలులా విధేయత చూపి, పౌలులా దేవునిపై ఆధారపడి, పౌలులా ఆత్మలను సంపాదిద్దాము, అవసరమైతే పౌలులా ప్రాణాలిద్దాము.

**: డా॥ పి.సతీష్ కుమార్**

# ఏ భేదము లేదు - అందరూ "బాబా" లే !!!



తన సంఘములోను, సంఘపెద్దల గృహాల్లోను, తన సంఘస్తుల కుటుంబాల్లోను, కుటుంబ వ్యవహారాల్లోను భార్యలదే అంతా పెత్తనమనే విషయం ఆలస్యంగా గ్రహించిన ఆ సంఘ కాపరి అయ్యో! భర్త ఇంటికి యజమాని గదా! భార్య భర్తకు లోబడాలి కదా! నా సంఘస్తులలో అనేకులు దేవుని వాక్యానికి వ్యతిరేకంగా జీవించుచున్నారు. కనుక తన సంఘాన్ని ఎలాగైనా సరే దారిలో పెట్టాలని పూనుకున్నాడు. ఆ ఆదివారం తన ప్రసంగముఈ విధముగా కొనసాగించెను. "అయ్యలారా! ఆదాము హవ్వ మాటవిని ఆమె ఆజ్ఞను గైకొని, ఆ పండుతిని మానవ జాతికి మరణాన్ని కొనితెచ్చెను. అబ్రహాము శారా మాటవిని, హాగరు ద్వారా ఇష్మాయేలును కని సువార్తను నమ్మని, వినని జనాంగమును మిగిల్చెను. అలాగే తన భార్యయైన యెజెబెలు ప్రేరేపణచేత యెహోవా దృష్టికి కీడుచేయ తన్నుతాను అమ్ముకొనిన ఆహాబు వంటివాడు ఎవ్వడునూ లేడు. (1రాజు 21:25) ఈ విధముగా బైబిల్ గ్రంథమందు భర్తలు భార్యల మాట విని ఎలా పొరపాటు చేశారో తెలియజేస్తూ, సంఘానికి క్రీస్తు ఏ విధముగా శిరస్సో అలాగే కుటుంబానికి భర్తే శిరస్సని దాన్ని భార్య ఎటుతిప్పితే అటు తిరగనియ్యకూడదని బల్లగుద్ది మరీ ఆవేశపడుతూ వాక్యాన్ని ముగించెను. ఈ విధముగా కుటుంబంలో భార్యభర్తల పాత్రను గురించి ఆ నెలంతా బోధించిన మీదట ఆ మరుసటి ఆదివారం.....

ప్రియమైన సంఘమా! ఈ నెలంతా కుటుంబం, కుటుంబంలో భార్యభర్తల పాత్రను గురించి వాక్యాన్ని ధ్యానించాము. భర్త భార్యను ప్రేమించాలని, భార్య భర్తకు లోబడాలని, ఇది వాక్యానుసారమని స్పష్టముగా మీకు భోదించితిని. మీలో తప్పక మార్పుకూడ వచ్చి యుండును. కనుక ఈరోజు మీకో పరీక్ష. ఈ నెలంతా వాక్యం విన్న తరువాత ఇంకా భార్యకు లోబడేవారు అంటే భార్య బాధితులు లేచి కుడి ప్రక్కకు నిలబడండి అని ధీమాగా అడిగెను. (ఏ ఒక్కరో ఇద్దరో ఉంటారని అతని నమ్మకం) తీరా చూస్తే చర్చి ప్రెసిడెంట్, సెక్రెటరీ, ట్రెజరర్, క్వయర్ లీడర్ ఒక్కరేంటీ అంతా లేచి ఓ ప్రక్కకు నిలబడిరి. వీరందరిని చూసిన పాస్టర్‌గారికి నోట మాటరాక అలా చూస్తూ ఉండిపోయాడు. అప్పటి వరకు దర్జాగా కూర్చున్న మగవాళ్ళంతా లేచి ఓ ప్రక్కకు నిలబడిరి. కానీ ఒకాయన మాత్రం కదలక మెదలక ధీమాగా తలవంచుకొని కూర్చున్నాడు. ఆయన్ను చూసిన పాస్టరు గారికి కొండంత బలం చేకూరింది. పోనీలే నా బోధలు ఒక్కడినైనా మార్చగలిగినవని ఎంతో సంతోషపడుతూ అక్కడ కూర్చున్న ఆయన్ని పిలిచి అయ్యా! రండి! మీరన్నా ధైర్యంగా సాక్ష్యం చెప్పండి. నాది వాక్యానుసారమైన జీవితమని, దేవుడు గలిగిన కుటుంబమని చెప్పండి రండి అని పిలిచెను. కూర్చున్న ఆయన మెల్లగా లేచి మైకుముందు గొంతు సవరించుకొని " ఏ బేధము లేదు అందరూ "భాబాలే" అంటే భార్య బాధితులే. నేను కూడా లేచి అందరితోబాటు నిలుచుందామని మా యావిడవైపు పర్మిషన్ కోసం చూశాను. ఆమె కళ్ళెర్ర చేసి నువ్వెళ్ళకు. తలొంచుకొని ప్రార్థిస్తూ కూర్చో అని సైగ చేసింది. ఏమి చెయ్యను చెప్పండి? "భాబానే కదా" కదలకుండా ప్రార్థిస్తూ కూర్చొన్నా.

ప్రియ చదువరీ! ఈ రోజులు ఇలా ఉన్నాయి కాని బైబిల్ గ్రంథమందు దేవుడు ఒక క్రమము ఏర్పాటు చేసెను. అదేమనగా..... "భర్తకు భార్య లోబడవలెను, భార్యను భర్త ప్రేమించవలెను" భార్యభర్తలు అన్యోన్య సహవాసము కలిగి బిడ్డలను ఆత్మీయ వాతావరణంలో పెంచాలి. భర్త తాను ఇంటి యజమాని కనుక కుటుంబ వ్యవహారాలన్ని వివేకముతో వ్యవహరించవలెను. ఇంటికి యజమానియైన భర్త మాట భార్య విన్నప్పుడే పిల్లలు కూడా తమ తల్లికూడా తండ్రికి లోబడుతుందని గ్రహించి వారును లోబడతారు. అలాగే భర్త తన భార్యను అమితంగా ప్రేమించుట చూసిన పిల్లలు ప్రేమ గలిగి జీవిస్తూ తాము పెద్దవారైనపుడు మీరు చూపిన మాదిరి కొనసాగించి శాంతి సమాధానము గల కుటుంబము కలిగియుంటారు.

**: డా॥ పి. సతీష్ కుమార్**

# నాకే ఎందుకు ఈ కష్టం



ఆర్థర్ ఆషీ వింబుల్డన్‌లో ఆడిన ఓ గొప్ప టెన్నీస్ ఆటగాడు. ఎయిడ్స్ రోగంతో మరణించవలసి వచ్చింది. తను ఏ పాపం చేయకపోయినా గుండె చికిత్స చేస్తున్నప్పుడు వేరేవారి రక్తాన్ని వాడినప్పుడు ఆ రక్తము ద్వారా అతనికి 1983లో ఎయిడ్స్ వ్యాధి సోకింది. అతను ఎంతో ఆత్మీయుడు, ప్రార్ధనాపరుడు. తమ అభిమాన క్రీడాకారుడు ఎయిడ్స్ రోగంతో చనిపోతున్నాడని విని ఎంతోమంది ఉత్తరాలు వ్రాశారు. స్నేహితులు వచ్చి కలిసి వెళ్ళారు. ఆత్మీయుడైనప్పటికి ఇంత ఘోర రోగంతో మరణించవలసి వచ్చినప్పుడు అందరినోటా ఒకేఒక్క ప్రశ్న ఎందుకు ఈ రోగం నీకే రావాలి? ఎందుకు దేవుడు నీకే ఈ రోగాన్ని ఇవ్వాలి అని ప్రశ్నించేవారు.

నిజమే, అన్యాయంగా బాధ ననుభవించవలసి వచ్చినప్పుడు, శోధనకు గురి అయినప్పుడు, నిర్నిమిత్తముగా మనుష్యులు నిందిస్తున్నప్పుడు, నీ తప్పు లేకపోయినప్పటికీ శిక్ష భరించవలసి వచ్చినప్పుడు, ప్రభువా! 'నాకే ఎందుకీ కష్టాలు' నేనే ఎందుకు భరించాలి అని గుండె కేకలు వేస్తుంది. ఆ ఎయిడ్స్ రోగంతో మరణంతో పోరాడుతున్న ఆ విశ్వాస వీరునికి ఈ ప్రశ్న వేసినప్పుడు...

ప్రపంచ మొత్తం మీద 5 కోట్ల మంది టెన్నీస్ క్రీడాకారులు టెన్నీస్ ఆడతారు. వారిలో 50 లక్షల మంది టెన్నీస్ కోచింగ్ తీసుకొని మరీ ఆడతారు. అందులో 5 లక్షల మంది పరిణతి చెందిన టెన్నీస్ క్రీడాకారులుగా పేరు పొందుతారు. 50వేల మంది రాష్ట్రస్థాయి టెన్నీస్ క్రీడాకారులుగా ఎదుగుతారు. అందులో ఇంచుమించు 500 మంది గ్రాండ్‌శ్లామ్ టైటిల్ కోసం పోరాడతారు. చివరికి 50 మంది మాత్రమే వింబుల్డన్‌లో ఆడే గొప్ప అవకాశం పొందుకుంటారు. కడకు నలుగురు మాత్రమే సెమీ ఫైనల్స్‌కు వస్తారు. చివరకు ఇద్దరు ఫైనల్స్‌లో పోరాడతారు. ఎట్టకేలకు ఒకేఒక్క వ్యక్తి వింబుల్డన్ కప్ కైవసం చేసుకొంటాడు. ఆరోజు వింబుల్డన్ కప్ పట్టుకొన్నప్పుడు ఎందుకని ప్రభువా! 5 కోట్ల మంది టెన్నీస్ క్రీడాకారులకు లేని భాగ్యాన్ని నాకే ఎందుకిచ్చావ్ అని అడుగని నేను ఈరోజు బాధలో వ్యాధితో ఎందుకని ప్రభువా! నాకే ఈ కష్టాలిచ్చావ్ అని అడుగగలను? కష్టాలు మనల్ని బలపరుస్తాయి, రెచ్చిపోకుండా, హెచ్చిపోకుండా చేస్తాయి. విజయం మన ముఖమును మెరిపించవచ్చేమో గాని క్రీస్తు మాత్రమే మనల్ని మురిపించగలడు, సంతోషంగా మరణాన్ని ఎదుర్కోనివ్వగలడని ఎంతో విశ్వాసంతో జవాబిచ్చెనట.

నిజమే, మనచుట్టూ ఎంతోమంది అనారోగ్యంతో, కుదరని రోగాలతో బాధ పడుతున్నప్పుడు నాకే ఎందుకిచ్చావ్? ఇంత మంచి ఆరోగ్యం అని అడుగని మనము, చదువుకున్నప్పటికీ ఉద్యోగాలు లేక అల్లాడిపోతూ ఉన్నవారు కోకొల్లలుగా వుండగా మంచి ఉద్యోగం సంపాదించినప్పుడు లక్షల మందికి లేని ఈ ఉద్యోగం నాకే ఎందుకిచ్చావ్? అని అడుగని మనము, తినడానికి తిండిలేక, కట్టుకోడానికి బట్టలు లేక, ఉండడానికి గూడు లేక కోట్లమంది అల్లాడిపోతున్న ఈ రోజుల్లో ఎందుకయ్యా కడుపునిండా భోజనం పెడుతున్నావ్? ఎందుకయ్యా ఇన్ని బట్టలిచ్చావ్? ఎందుకయ్యా ఇంతమంచి ఇల్లునిచ్చావ్? అని ప్రశ్నించని మనము కష్టమొచ్చినప్పుడు, బాధ వచ్చినప్పుడు నాకే ఎందుకీ కష్టాలు అని అడిగే కనీస అర్హత మనకు ఉన్నదంటారా? అన్నీ పోగొట్టుకొన్న యోబు అన్నాడు - "యెహోవా ఇచ్చెను యెహోవా తీసుకొని పోయెను. ఆయనకు మహిమ కలుగును గాక! ప్రశ్నించే మనస్సు జవాబు పొందదుకాని ప్రశ్నించక విశ్వసించి స్తుతించే మనస్సే రెండంతల దీవెనను పొందుతుంది. ఇంతకీ నువ్వెవరివి?

: డా॥ పి.సతీష్ కుమార్

**మీరు వీక్షిస్తున్నారా? మన ఎడిటర్ గారిచే ప్రసారం చేయబడుచున్న "కల్వరి స్వరం" ఆధ్యాత్మిక కార్యక్రమంలో జీవితాలను మార్చే శక్తివంతమైన సందేశంతో పాటు, హృదయాలను స్పందింపజేసే పాటలు మరియు వివిధ అంశాలతో కూడిన ఈ కార్యక్రమాన్ని 'మా' టీవీలో శుక్రవారం ఉ॥ 6.30-7.00 గం॥ల వరకు, 'సంస్కృతి' లో రాత్రి 9.00 గం॥లకు శనివారం మరియు 'జీ తెలుగు'లో ఆదివారం ఉ॥ 7.00-7.30 గం॥ల వరకు తప్పక వీక్షించండి! ఆశీర్వాదములు పొందండి!!**

# ఈ చరిత్ర సత్యాలు

దేవుడు సాతాను ఆలోచనలను తలక్రిందులు చేయగలడు. ఆయన సాతానీయ కార్యములపై విజేత అని చరిత్ర నిరూపింపగలదు. దేవునికి వ్యతిరిక్తముగా నిలిచిన ప్రముఖులు నాశనమయ్యారు, వారి ఆలోచనలు తలక్రిందులయ్యాయి కాని ఆయన వాక్యము, సంఘము సజీవముగానే నిలిచియున్నాయి.

## వోల్టేర్

వోల్టేర్ ప్రఖ్యాత ఫ్రెంచి తత్త్వవేత్త. ఆయన 1779వ సం॥లో మరణించాడు. ఆయన తన మరణానికి ముందు ఒక 100 సంవత్సరాలలో క్రైస్తవ్యము పూర్తిగా ఈ భూమిపై నుండి తుడిచివేయబడుతుందని ప్రవచించాడు. అయితే అతడు మరణించిన తర్వాత 50 సంవత్సరముల అనంతరం అతని ఇల్లు, సొత్తు బైబిలు సొసైటీ వారికి విక్రయించబడెను. జర్మన్ బైబిలు సొసైటీ వారు ఆ ఇంటినే కేంద్రముగా చేసికొని, బైబిళ్ళను ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. వోల్టేర్ వ్రాసిన గ్రంధాలు మాసిపోయాయి కాని, దేవుని వాక్యము సజీవమై నేటికి అనేకులకు మార్గదర్శకముగా ఉంది. "సర్వశరీరులు గడ్డియై యున్నారు; వారి అందమంతయు అడవి పువ్వువలె ఉన్నది. గడ్డి ఎండిపోవును దాని పువ్వు వాడిపోవును మన దేవుని వాక్యము నిత్యము నిలుచును". (యెష 40:6-8)

## హిట్లర్



రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యావత్ ప్రపంచాన్ని గడగడలాడించిన హిట్లర్ గొప్ప నియంత! ఇతడు జాతి దురహంకారి! జర్మన్ దేశస్థులే స్వచ్ఛమైన జాతియని, వారే ప్రపంచ పాలకులు కావాలని కలలు కనేవాడు. నాజీ పార్టీని స్థాపించాడు. తన ఆలోచనలను విస్తృతపరచి, వారి మధ్య జాతి విద్వేషాగ్నిని రెచ్చగొట్టాడు. దాని ఫలితముగా జర్మను దేశానికి అధికారి అయ్యాడు. తన నాజీ పార్టీ సిద్ధాంతాలను ప్రపంచమంతా ప్రకటించాలని సంకల్పించాడు. ఇతడు క్రైస్తవ విరోధి. క్రీస్తు సువార్తకంటె ఎక్కువగా తన నాజీ సిద్ధాంతాలను ప్రచారం చేసి, ప్రపంచాన్ని నాజీమయం చేయాలనుకొన్నాడు. ఉత్తర ఆఫ్రికా ఖండంలో నాజీ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి ఒక పెద్ద భవంతిని కట్టి దానిలో రేడియో స్టేషను నెలకొల్పాడు. హిట్లర్ మరణానంతరం ఆ రేడియో స్టేషను మూతపడింది. నాజీ పార్టీయే నేడు కానరాకుండా పోయింది. "ట్రాన్స్ వరల్డ్ రేడియో" వారు ఆ రేడియో స్టేషన్‌ను కొని, అదే కేంద్రం నుండి క్రీస్తు శుభవార్తను ఐరోపా, రష్యా, ఆఫ్రికా దేశాలకు అందిస్తున్నారు. ఎంత అద్భుతము. క్రైస్తవ్యాన్ని రూపుమాపాలనుకున్న నియంతలు, తత్త్వవేత్తలు, రాజులు మున్నగువారు నామ రూపాలు లేకుండా పోయారు. అయితే దేవుని వాక్యము సజీవమై నిలిచి అనేకుల బ్రతుకులను బాగుచేయుచున్నది. దేవునికి స్తోత్రం.

## సౌలు

సౌలు ఆది సంఘమును చెదరగొట్టవలెనని నజరేయుడైన యేసు నామమునకు విరోధముగా అనేక కార్యములు చేయుచుండెను. దమస్కు రోడ్డులో ప్రభువు దర్శనమిచ్చి "సౌలా! సౌలా! నీవేల నన్ను హింసించుచున్నావు. మునికోలలకు ఎదురు తన్నుట నీకు కష్టమని" చెప్పెను. (అపో.కా. 26:14)

సిలువ దర్శనము పొందిన సౌలు పౌలుగా మారెను. క్రైస్తవులను హింసించు సౌలు ఆత్మల రక్షణ కొరకు ప్రసవవేదనపడు పౌలుగా మారెను. సంఘములను పాడుచేయు సౌలు సంఘములను కట్టు పౌలు ఆయెను. (మత్త 21:44)

: డా॥ ఎన్. జయపాల్



# అవమాన పరచబడియు...

సెయింట్ ఫ్రాన్సిస్ గ్జేవియర్ జపాన్ దేశమందు మిషనరీగా సేవ చేస్తున్న రోజులవి. ఆయన ఒకచోట గంభీరంగా వాక్య పరిచర్య చేయుచుండగా అనేక మంది బహు శ్రద్ధతో వినుచుండెను. ఇంతలో ఒకతను సెయింట్ ఫ్రాన్సిస్‌గారి దగ్గరకు వెళ్ళి ఏదో మెల్లగా చెప్పబోయెను. అది గమనించిన ఫ్రాన్సిస్ వినుటకు అతని యెదుట తల వంచగా వచ్చిన ఆ వ్యక్తి గాండ్రించి ముఖం మీద అందరిముందు ఉమ్మివేసి ఏమీ ఎరగనట్టు వెళ్ళిపోయాడు. అక్కడ ఉన్నవారంతా జరిగిన దానికి నిర్ఘాంతపోయిరి. ఇంతలో ఫ్రాన్సిస్ తన జేబులో వున్న చేతి రుమాలు తీసుకొని ఆ ఉమ్మును తుడుచుకొని ఏమి జరగనట్టు మరలా నవ్వుతూ వాక్య పరిచర్యను కొనసాగించెనట. ముఖము మీద ఉమ్మివేయబడినప్పటికీ నొచ్చుకొనకుండా ఆయన సందేశాన్ని కొనసాగించడం వాక్యం వింటున్నవారు చూచి బహుగా ఆశ్చరపడిరి.

అన్యుడైన ఒక డాక్టర్ జరిగిన దానిని చూచి తన కళ్ళను నమ్మలేకపోయెను. ఒక వ్యక్తి నిర్దాక్షిణ్యంగా ఉమ్మివేస్తే ఎటువంటి కోపానికి, ఆవేశానికి, బాధకు గురికాకుండా ఆయన తన ముఖమును తుడుచుకొన్నాడంటే అతను సామాన్యుడు కాదు. తప్పక తాను నమ్మిన దేవుడు గొప్పవాడై యుంటాడు. గనుకనే అటువంటి గొప్ప వ్యక్తిత్వాన్ని, తగ్గింపును కనబరిచాడు. ఆ రోజు జరిగిన ఆ సంఘటన ఆ డాక్టరుపై ఎంతో ప్రభావం చూపింది. ఆ తర్వాత కొద్ది దినాలకే అదే డాక్టర్ సెయింట్ ఫ్రాన్సిస్ గ్జేవియర్ ద్వారా రక్షించబడి బాప్తీస్మము కూడా తీసుకొనెను. అతను రక్షించబడుట ద్వారా మరెందరో ప్రభువుని అంగీకరించిరి. ఇంతమంది రక్షించబడుటకు కారణం ఓ మూర్ఖుడు ఉమ్మివేయడమా? లేక ఉమ్మివేయబడినప్పటికీ క్రీస్తు వ్యక్తిత్వాన్ని చూపించడమా? సరైన జవాబు ఉమ్మివేయబడినప్పటికీ క్రీస్తు వ్యక్తిత్వం చూపించడం. ఇతరులు మనలో ఆత్మీయత, క్రీస్తును, ప్రేమను, సహనాన్ని తగ్గింపును చూడాల్సింది అనుకూల పరిస్థితిలో కాదు, మనం దూషించబడినపుడు, ద్వేషించబడినపుడు, అపార్థం చేసుకొనబడినపుడు, అన్యాయ తీర్పుకు గురి అయినపుడే. మనలో ఉన్న క్రీస్తును ఇతరులకు చూపించే అవకాశం దొరుకుతుంది. అన్నీ బాగున్నప్పుడు, అన్నీ సక్రమంగా సాగుతున్నప్పుడు అందరూ మంచివారుగానే కనిపిస్తారు. ఆత్మీయంగా అగుపడుతారు. తుఫాను వచ్చినప్పుడే మనలో ఉన్న అసలు విశ్వాసం బయటపడుతుంది. గనుక ప్రియ చదువరి! నువ్వు నిందించబడుతున్నప్పుడు తిరిగి నిందించడం, ద్వేషించబడుతున్నప్పుడు తిరిగి ద్వేషించడం అనే తత్వము కలిగియుంటే నేడే సరిచేసుకో. నిన్ను సైతాను, సైతాను మనుష్యులు రెచ్చగొడుతున్నప్పుడు నీ ఆత్మీయతను కనపరచుటకు గొప్ప అవకాశం.

పౌలు చేతికి విష జంతువు చుట్టుకొన్నప్పుడు దానిని చూచి భయపడక, దానిని అగ్నిలో దులిపినప్పుడే అతను దేవతగా భావించబడెను. ఆ ద్వీప వాసులకు సువార్త చెప్పి రక్షణలోనికి నడుప గలిగెను. యోహాను అగ్ని పర్వతములుగల పద్మాసు ద్వీపములో వున్నప్పుడే ఆ అగ్ని పర్వతముల మధ్య దేవుని దర్శనాన్ని, ప్రకటన గ్రంథాన్ని మనకు అందించగలిగెను. బహుగా గాయపరచబడిన పౌలు సీలలు ఆ అననుకూల పరిస్థితిలో గాయాల మధ్య, దొంగల మధ్య, సంకెళ్ళ మధ్య దేవుని మహిమ పరచుట ద్వారా ఆరోజు జైలు అధికారి కుటుంబాన్ని రక్షణలోనికి నడిపించెను. కనుక నీ ముందు నేడు కలిగియున్న విపత్కర పరిస్థితులను దేవునికి మహిమకరంగాను, ఇతరులకు దీవెనకరముగాను మార్చుకొని నీలోవున్న క్రీస్తును, క్రీస్తు ప్రేమను శత్రువులుకూడా గ్రహించే విధముగా జీవించు. నమ్మకమైన దాసునిగా, ఆత్మీయునిగా ప్రభువు ముందు నిలబడు.

“అన్యజనులు మీరు ఏ విషయములో దుర్మార్గులని దూషింతురో ఆ విషయములో వారు మీ సత్క్రియలను చూచి, వాటిని బట్టి దర్శన దినమున దేవుని మహిమ పరచునట్లు వారి మధ్యను మంచి ప్రవర్తన గలవారై యుండవలెనని మిమ్మును బ్రతిమిలాడుచున్నాను.” (1 పేతు 2:12)

**: డా॥ పి. సతీష్ కుమార్**

# సేవకులకు ప్రసంగ సహకారి

పి. ఎస్కే

## విశ్వాసి హృదయం

1. పగిలిన హృదయం - పశ్చాత్తాపపడుతుంది. (కీర్త 51:17)
2. తెరువబడిన హృదయం - వాక్యంపట్ల లక్ష్యముంచుతుంది. (అపో.కా. 16:14)
3. యధార్థ హృదయం - దేవునికి విధేయత చూపుతుంది. (ఎఫె 6:5)
4. పవిత్ర హృదయం - హృదయపూర్వకంగా ప్రేమిస్తుంది. (1 పేతు 1:22)
5. ప్రోక్షించబడిన హృదయం - దేవుని సన్నిధికి చేరుస్తుంది. (హెబ్రీ 10:22)
6. స్థిరమైన హృదయం - దేవుని హత్తుకొనును. (అపో.కా. 11:23)



## ప్రార్థన ఎలా చేయాలి ?

1. మోకాళ్ళూని : ఎఫెసి 3:14
2. కన్నులు పైకెత్తి : యోహా 11:41
3. దేవుని వైపుకు చూస్తూ : కీర్త 25:1
4. ఆత్మను ఎత్తికొని : కీర్త 25:1
5. హృదయము కుమ్మరిస్తూ : కీర్త 62:8
6. ఆత్మను కుమ్మరిస్తూ : 1 సమూ 1:15
7. దేవుని పేరిట ప్రార్థిస్తూ : ఆది 12:8; కీర్త 116:4
8. కంఠ స్వరమెత్తి : కీర్త 27:7
9. దీనత్వంతో మొరపెట్టుట: కీర్త 34:6
10. ఆకాశం తట్టు తిరిగి : 2 దిన 32:20,మార్కు 6:41
11. బ్రతిమాలుకొంటూ : నిర్గ 32:11
12. ఆయన సన్నిధిని వెదకుచూ : కీర్త 27:8
13. నిలువబడి : 1రాజు 8:22;మార్కు 11:25
14. సాగిలపడి : కీర్త 95:7; మత్త 26:39
15. మోకరించి : మార్కు1:35;లూకా 22:41; అపో.కా. 20:30
16. చేతులు చాచి : యెష 1:15
17. చేతులు పైకెత్తి : కీర్త 28:2; విలాప 2:19; 1 తిమో 2:8

## మనం కలిగియుండవలసిన సహవాసము

1. తండ్రితో సహవాసము : 1 యోహా 1:3
2. కుమారునితో సహవాసము : 1 కొరిం 1:9
3. ఆత్మతో సహవాసము : ఫిలి 2:1
4. వెలుగుతో సహవాసము : 1 యోహా 1:7
5. శ్రమలతో సహవాసము : ఫిలి 3:10

## ప్రార్థనలో ఏమి ఉండాలి ?

1. స్తుతి ఆరాధన : కీర్త 66:17
2. మెలుకువ : లూకా 21:36; 1పేతు 4:7
3. కృతజ్ఞత : ఫిలి 4:6; కొల 4:2
4. కన్నీటిని : యిర్మీ 31:9; హోషే 12:4
5. ఉపవాసము : నెహె 1:4; దాని 9:3; అపో.కా. 13:3
6. ఒప్పుకోలు : నెహె 1:4,7; దాని 9:4-11
7. పశ్చాత్తాపము : 2దిన 7:14; లూకా 18:13

## బాధల్లో, వ్యాధుల్లో, ఇబ్బందుల్లో ఉన్న...

1. వారికోసం ప్రార్థించాలి.
(అపో.కా. 12:5; ఫిలి 1:16,19; యాకో 5:: 14-16)
2. వారి బాధను కన్నీటిని పంచుకోవాలి.
(రోమా 12:15; గల 6:2)
3. భక్తిహీనుడైనను దయ చూపాలి. (యోబు 6:14)
4. కష్టాల్లో ఉన్నవారిని జ్ఞాపకం చేసుకోవాలి.(హెబ్రీ 13:3)
5. పరామర్శించాలి. (యాకో 1:27)
6. మాటలతో ఓదార్చవలెను.
(యోబు 16:5; 29:25; 2 కొరిం 1:4)
7. సహాయము చేయవలెను.
(1 తిమో 5:10; యెష 58:10; ఫిలి 4:14)
8. వారిని విడిపించుడి, తప్పించుడి.
(కీర్త 8:3,4; సామె 22:22)

Published and Edited by: **Dr. P. Satish Kumar,** Calvary, Post Box No. 30, Kukatpally, Hyderabad - 72. (A.P)

Printed by : **Surya Graphics,** # 1-1-283/C/1, Municipal Market Lane, Chikkadapally, Hyderabad - 20. (A.P)

## కల్వరి మిషన్ సమర్పించు

### కనీ వినీ ఎరుగని అద్భుతమైన సంగీతం & గానంతో...



రచన, గానం:

### డా॥ పి. సతీష్ కుమార్

**వినండి!! గొప్ప ఆశీర్వాదములు పొందండి!**

**క్యాసెట్ వెల: రూ॥ 35/-, సిడి వెల: రూ॥70/-**

# కల్వరి స్వరం

అద్భుతమైన ఆధ్యాత్మిక టీవీ కార్యక్రమము

'మా' టీవీ లో శుక్ర: ఉ॥ 6.30 గం॥లకు

'సంస్కృతి' లో శని: రా॥ 9.00 గం॥లకు

'జీ తెలుగు' లో ఆది: ఉ॥ 7.00 గం॥లకు

తప్పక వీక్షించండి! గొప్ప ఆశీర్వాదములు పొందండి!!

సేకరణ:

డా॥ ఎన్. జయపాల్

# గొప్ప పలుకులు

- మనమెంత దూరం నడిచి ప్రసంగించినప్పటికీ, మన నడత ద్వారా క్రీస్తును ప్రకటించనిచో వ్యర్థమే. - సెయింట్ ఫ్రాన్సిస్
- పరిశుద్ధాత్మ నడిపింపు లేనిచో మౌనముగా వుండవలెను గానీ, సొంత ప్రసంగాలు అందించరాదు. - ఛార్లెస్ స్పర్జన్
- క్రీస్తు నిన్న మరణించినట్లు, ఈ ఉదయం పునరుత్థానుడై లేచినట్లు, రేపే వస్తున్నట్లు జీవించు, బోధించు. - ఓ.జె.స్మిత్
- గొప్ప వర్తమానాలు సువార్త కూడికకు మంచిపేరు తెస్తాయి గాని, మంచి వర్తమానాలు ప్రభువుకు మహిమ తెస్తాయి. - జయపాల్
- బాగా జీవించడమే బాగా బోధించడం. - సెర్వాంటీస్
- నేను చేసిన ప్రసంగాలే చేస్తాను. ఎప్పుడంటే వినేవారు మారనప్పుడు, విననివారు మారినప్పుడు. - ఏడేన్
- మనం ప్రసంగాలను సిద్ధపరచుకోడానికి ప్రయత్నిస్తున్నాము గానీ, దేవుడు మనల్ని ప్రసంగాలకోసం సిద్ధపరచడానికి ప్రయత్నిస్తున్నాడు. - జయపాల్
- ప్రతి క్రైస్తవునికి నడిచే ప్రసంగాలు కావాలి. - సెయింట్ ఫ్రాన్సిస్
- మనకు ఒక విషయం క్షుణ్ణంగా తెలిసినప్పుడే దానిని ఇతరులకు బోధించాలి. - ట్రియన్ ఎడ్వర్డ్సు
- నిజముగా ప్రసంగించుట చెమట, రక్తము కార్చునటువంటిది. - జోసెఫ్ పార్కర్
- నీవు ఇతరులకు బోధిస్తున్నప్పుడు, నీ గురించి మాట్లాడుచున్నారా? నీలోని క్రీస్తును గురించి మాట్లాడుతున్నావా? పరీక్షించుకో! - రత్నం
- ప్రసంగించుటకు అతి ముఖ్యమైన సిద్ధపాటు నీ జీవితమును సిద్ధపరచుకొనుటయే! - జయపాల్
- జీవితము బాగుండి ప్రసంగము బాగోలేకుంటే ప్రజలు ఏడుస్తారు. ప్రసంగం బాగుండి జీవితము బాగోలేకుంటే ప్రభువు ఏడుస్తాడు. - ఇంగ్లీషు రచయిత
- ఎరుగని వారికి మాటతోను, ఎరిగిన వారికి జీవితముతోను ప్రసంగించు సేవకుడు బహుగా ఫలించును. - ఒకాయన

  గుంపులకు ప్రసంగించుచు అనేక స్థలములు తిరుగుట మాత్రమే చాలదుగాని వ్యక్తిగతంగా మనుష్యులను పట్టుకొని క్రీస్తులోనికి నడిపించడం చాలా ముఖ్యం. - టి. వాల్కర్
- కొందరు ప్రసంగం ప్రారంభించలేక కష్టపడితే కొందరు ప్రసంగం ముగించడానికి కష్టపడతారు. - ఒక నిజం
- హృదయముతో కాక ఎక్కువగా తలతో ఆలోచించి సిద్ధపరచబడిన ఒక ప్రసంగము వినువారికి శక్తివంతముగా వుండదు. - రిచర్డ్ శిసిల్
- నేను బోధించునప్పుడు ఇక నేనెన్నడును వారిని కలిసికొనలేననుకొని తీవ్రముగా బోధించెను. - వెబ్
- క్రీస్తును ప్రకటించేవారిగానే కాదు, మీరే క్రీస్తుకు ఒక ప్రకటనగా ఉండాలి. క్రీస్తును గురించి బోధించేవారిగానే కాదు, మన ప్రవర్తనలో క్రీస్తును ఇతరులకు చూపించాలి.
- మనమేమి బోధిస్తున్నామో అది ఆచరణలో చూపడము ద్వారానే బాగుగా బోధించగలము.
- దేవుని యొద్దనుండి సందేశమును పొంది బోధించువాడే నిజమైన బోధకుడు. సొంత బోధను చేయువారందరు అబద్ధ బోధకులే!